

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 24.0





బాబు పైనే.. ఆశలన్నీ!

- ముందుకు కదలని చింతలపూడి ఎత్తిపోతలు
- రైతులకు అందని మామిడి పరిశోధన ఫలాలు
- అభివృద్ధికి నోచుకోని నూజివీడు పట్టణం
- నూజివీడు- విజయవాడ రోడ్డులో కష్టాలు
- జిల్లా మార్పు కోసం నూజివీడు నియోజకవర్గ వాసుల విజ్ఞప్తి

ఏలూరు/నూజివీడు/ టౌన్/ ఆగిరిపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబు నాయుడు నూజివీడు నియోజకవర్గంలో రెండు సార్లు పర్యటించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి, మామిడి పరిశోధన కేంద్రం సలహాలతో రైతుల వెతలు తీర్చుతామని హామీలిచ్చారు. అయితే అవి కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు నూజివీడు నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించనున్న నేపథ్యంలో హామీలపై వరాల జల్లు కురిపిస్తారన్న ఆకాంక్షను నియోజకవర్గ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

చింతలపూడిపై రైతుల ఆశలు

ఉమ్మడి కృష్ణాజిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని దాదాపు ఆరు నియోజకవర్గాల్లో ఎన్ఎస్‌పి ఆయకట్టు స్థిరీకరణ చేస్తూ ఐదు లక్షల ఎకరాల మెట్ట భూములకు గోదావరి జలాలను అందించే లక్ష్యంతో చేపట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకం గత ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్య ధోరణితో సందిగ్ధంలో పడింది. ఈ పథకం ద్వారా దాదాపు వందల గ్రామాలకు తాగునీటి సమస్య తీరడంతో పాటు సాగునీరు అందుతుంది. గత ఎన్నికల్లో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ప్రథమ ప్రాధాన్యతగా తీసుకొని పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు రాష్ట్ర గృహ నిర్మాణ పౌరసంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.4,900 కోట్లతో పనులు చేపట్టగా ఫేజ్-1 2008లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. ఫేజ్-2కు 2017లో చంద్రబాబు విస్సన్నపేట వద్ద మొద్దులపర్వలో శంకుస్థాపన చేశారు. ఈ పథకానికి పర్యావరణ అనుమతులు లేవని 2018లో ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే వట్టి వసంతకుమార్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు


పనులు నిలిచిన చింతలపూడి ఎత్తిపోతల పథకం కాల్వ


సభావేదిక వద్ద స్టాల్స్

ఫిర్యాదు చేశారు. విచారణ నిర్వహించిన ట్రిబ్యునల్ 2022లో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.73 కోట్లు జరిమానా విధించింది. దీనిపై గత ప్రభుత్వం సుప్రీంకోర్టు తలుపు తట్టింది. మూడు నెలల్లో జరిమానా చెల్లించడం లేదా పర్యావరణ అనుమతులు తీసుకోవాలని గత వైసీపీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ తీర్పును ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోక పోవడంతో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేయాలని సుప్రీంకోర్టు తీర్పు నిచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాకా కూడా ఇప్పటికీ అదే పరిస్థితి ఉంది. ఇప్పటివరకు వివిధ కోర్టులలో ఈ పథకంపై ఇరవై కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల బడ్జెట్‌లో చింతలపూడి పథకానికి రూ.40 కోట్లే చూపారు. ఈ పథకం వల్ల ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలోని 2లక్షల 25వేల ఎకరాల భూమి సస్యశ్యామలం అవుతుంది. ప్రధానంగా ఆరు నియోజకవర్గాలైన నందిగామ, తిరువూరు, నూజివీడు, మైలవరం, గన్నవరం, దెందులూరు పార్టు సాగునీరు, తాగునీరు అవసరాలు తీరతాయి. ప్రతీ ఏటా సాగునీటి కష్టాలతో రైతులు అగచాట్లు పడుతున్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ సహకారంతో చింతలపూడి ఎత్తిపోతలను గాడిలోని పెట్టి మెట్ట ప్రాంత భూములను సస్యశ్యామలం చేసేందుకు సీఎం చంద్రబాబు చర్యలు చేపడతారనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

మామిడి పరిశోధన ఫలాలు ఎన్నడో..

మామిడి రైతులకు గిట్టుబాటు ధరల్లేక, వివిధ తెగుళ్లతో

నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

- వడ్లమానులో కులవృత్తిదారులతో ముఖాముఖి
- ఆగిరిపల్లి హైస్కూల్‌లో పీ-4 బహిరంగ సభ

దిగుబడులు తగ్గి పెట్టుబడులు కూడా రావడం లేదు. నారా లోకేశ్ యువగళంలో నూజివీడు మామిడి రైతులతో సమావేశంపై పంజాబ్ తరహాలో మ్యాంగో బోర్డు ఏర్పాటుకు పరిశీలన చేస్తానని హామీ ఇచ్చారు. మామిడి పరిశోధనా కేంద్రం ఫలాలు రైతులకు పూర్తిగా చేరడం లేదు. దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నూజివీడు చుట్టు పక్కల ప్రజలకు చెప్పుకోదగ్గ పరిశ్రమల్లేవు. మామిడి ఆధారిత ఉత్పత్తి పరిశ్రమలకు నడుం బిగిస్తే స్థానికంగానే ఉపాధి మార్గాలు లభ్యమవుతాయి. నూజివీడు రసాలంటే రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో పేరుంది. దీనికో బ్రాండ్ ఉత్పత్తుల కింద మామిడి ఆధారిత పరిశ్రమలకు మీరే శ్రీకారం చుట్టాలి.

నూజివీడు అభివృద్ధి అంతంతే..

రాష్ట్రంలోనే పురాతన పురపాలక సంఘాల్లో నూజివీడుకు పేరుంది.1983 నుంచి పంచాయతీ నుంచి మున్సిపాల్టీకి అటు తర్వాత గ్రేడ్-1 పురపాలక సంఘంగా గ్రేడ్ పెరిగినా అభివృద్ధిలో ఇంకా వెనుకంజలోనే ఉంది. ఇక్కడ పారిశుధ్యం, డ్రెయినేజీ, సరైన రోడ్లు, పార్కులు లేక లక్ష మంది ప్రజలు సతమతం అవుతున్నారు. పంచాయతీలో ఉన్నట్లే పారిశుధ్య సిబ్బంది టౌన్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

టిడ్కో ఇళ్ల గతి మారేనా..

నూజివీడులో 2,640 టిడ్కో ఇళ్లను 90 శాతం గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేశారు. మిగిలిన 10 శాతం పూర్తి చేసి పేదలకు ఇవ్వకుండా వాటిని వైసీపీ పాలకులు పాడుపెట్టారు. డ్రెయిన్లు

సీఎం టూర్ షెడ్యూల్

- ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 10 గంటలకు బయల్దేరి ఆగిరిపల్లి మండలం వడ్లమాను వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 10.10 గంటలకు చేరుకుంటారు. అధికారులు, అనధికారులు, ప్రజాప్రతినిధులు సీఎంకు స్వాగతం పలకనున్నారు.
- 10.20 గంటలకు రోడ్డుమార్గాన బయల్దేరి వడ్లమాను శివారులో బీసీ వర్గాలతో 11:20 గంటల వరకు నిర్వహించే ముఖాముఖిలో పాల్గొంటారు.
- అక్కడ నుంచి ఆగిరిపల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావేదికకు 11.30 గంటలకు చేరుకుంటారు. పీ-4 బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు వడ్లమాను రోడ్డులో కార్యకర్తలతో సమావేశమవుతారు.
- అనంతరం 2.35 గంటలకు వడ్లమాను హెలిప్యాడ్‌కు చేరుకుని కడప బయల్దేరి వెళ్లతారు.

ఏర్పాట్లు, ఇళ్లలో టైల్స్, టాయిలెట్లు ఏర్పాటు చేస్తే పేదలకు అందుబాటులోకి వస్తాయి.

నాలుగు లైన్ల రోడ్డు.. ఇండోర్ స్టేడియం

నూజివీడు- విజయవాడ డబుల్ లైన్ మార్గంలో అష్టకష్టాలు పడుతూ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. పెరిగిన జనాభా, ఇతర అవసరాలు, రవాణా కోసం దీనిని నాలుగు లైన్ల రహదారిగా పునర్ నిర్మించాలి. ఆగిరిపల్లి మీదుగా గన్నవరం ఎయిర్ పోర్టు రహదారి ఫోర్ లైన్ చేయాల్సి ఉంది. తాత్కాలికంగా పనులు చేస్తున్నారు. పదేళ్ల క్రితం ఎమ్మెల్సీ పాలడుగు వెంకట్రావు నిధులతో టౌన్‌లో చేపట్టిన ఇండోర్ స్టేడియం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రూ.కోటి వ్యయం చేస్తే బాస్కెట్‌బాల్ క్రీడకు అనువుగా స్టేడియం రూపుదిద్దుకుంటుంది. దీనిని పూర్తి చేస్తే బాధ్యత నేనే తీసుకుంటానని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు.

ఎన్టీఆర్ జిల్లాలో కలపండి..

అధికారంలోకి రాగానే నూజివీడు నియోజకవర్గాన్ని ప్రజల కోరిక మేరకు ఏలూరు జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతానని ఎన్నికలకు ముందు చంద్రబాబు నూజివీడు బహిరంగ సభలలో హామీ ఇచ్చారు. ప్రస్తుతం గ్రామీణ సమస్యల పరిష్కారంలో ఇటు ఏలూరు, అటు కృష్ణా జిల్లా పరిషత్‌లను సమన్వయం చేసుకోవాల్సి రావడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలని నియోజకవర్గ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.


సభా వేదిక వద్ద ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

డ్రోన్ కెమెరాలతో పటిష్ట భద్రత : ఎస్పీ

సీఎం పర్యటనలో భద్రతాపరంగా ఎలాంటి తప్పిదాలు జరగకుండా డ్రోన్ కెమెరాల ద్వారా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. సీఎం చంద్రబాబు శుక్రవారం ఆగిరిపల్లిలో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం ఆయన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్, జనసమ్మేళన నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీఎం పర్యటనకు ముగ్గురు అదనపు ఎస్పీలు, 13 మంది డీఎస్పీలు, 33 మంది సీఐలు, 72 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, 117 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 375 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 60 మంది మహిళా పోలీసులు, 208 మంది హోంగార్డులు, 897 మంది రోప్ పార్టీ, నాలుగు క్విక్ రియాక్షన్ టీమ్‌లను వినియోగిస్తున్నట్టు తెలిపారు.


మంత్రి పార్థసారథితో జేసీ ధాత్రిరెడ్డి, ఎస్పీ కిశోర్ చర్చలు

ఇది బీసీల సంక్షేమ ప్రభుత్వం

- మంత్రి కొలుసు పార్థసారథి

అణగారిన వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లిలో సీఎం పర్యటన ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'ఈ బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.47వేల 450 కోట్లు కేటాయించాం. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. వడ్డెరలకు క్వారీల కేటాయింపులో పదిశాతం, గీత కార్మిక కుటుంబాలకు మద్యం షాపుల కేటాయింపులో పదిశాతం ఇస్తున్నాం. సమాజంలో 70 నుంచి 80 శాతం వరకు ఉన్న షెడ్యూల్ కులాలు, తెగలు, వెనుక బడిన తరగతులకు చెందిన ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తీర్చిదిద్దేలా ఈ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మన రాష్ట్రానికి చెందిన వారు విదేశాల్లో ధనికులుగా ఉన్నవారు, వారు జన్మించిన గ్రామంలో నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకొని ఆ కుటుంబాలను అభివృద్ధి బాటలో నడిపేలా, వారి జీవితాలకు మార్గదర్శకులుగా చేసే కార్యక్రమమే ఈ పీ4 కార్యక్రమం. అర్హులైన ప్రతిపేదవాడికి పక్కా గృహాన్ని అందిస్తాం. బీసీల రక్షణ చట్టం రూపొందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు అందించే పారితోషకాన్ని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచాం. చేపల వేట విరామ సమయంలో మత్స్యకా రులకు పది వేల రూపాయలు అందిస్తున్నాం' అని తెలిపారు.

వెనుకబడిన వర్గాలకు ఆదరణ

- గతంలో చంద్రన్న హయాంలో రుణాల జాతర
- ఎస్సీ కార్పొరేషన్ లింకేజీ రుణాలు రూ.384 కోట్లు
- 2018-19 ఆదరణ-2 కింద రూ.కోటి 44లక్షలు
- కులవృత్తి సంఘాలకు రూ.39.65 కోట్లు
- ఆదరణ-3 కులవృత్తి సంఘాలకు మరోమారు మంచిరోజులు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన వర్గాలకు ఆదరణ చూపే పెద్దన్న పాత్రకు సీఎం చంద్రబాబు నాయుడు మార్కు పాలనే నిదర్శనం. 1994లో ఆదరణ పథకం కింద రజకులు, చేతివృత్తిదారులకు, పాల వ్యాపారులకు పలు రకాల పనిముట్లతో ఆయా వర్గాలకు చేరువయ్యారు. రెండోసారి ఆదరణ -2 కింద 2018లో పశ్చిమ ఉమ్మడి జిల్లాలో పలు రకాల యూనిట్ల మంజూరుతో వెనుకబడిన వర్గాలకు చేరువయ్యారు. తాజాగా వెనుకబడిన వర్గాలకు చెందిన పథకాలను ఒక్కొక్కటిగా గాడిన పెడుతూ.. సరికొత్త పథకాలకు, స్వయం ఉపాధికి శ్రీకారం చుడుతున్నారు. తాజాగా ఆదరణ-3 అమలు చేయాలని నిర్ణయించడంతో ఆయా వర్గాల్లో ఉపాధికి ఊతం ఇవ్వడానికి ఆస్కారం ఏర్పడనుంది. ఈసారి మహిళలకు ఉపాధికి ఊతమిచ్చేలా టైలరింగ్, మగ్గం, ఎంబ్రాయిడరీ తదితర రంగాల్లో శిక్షణతో పాటు ఉపాధికి బాటలు వేస్తున్నారు. దీంతో బీసీ వర్గాలకు మరోమారు మంచిరోజులు రానున్నాయి.

మెరుగైన విద్య కోసం..

జిల్లాలో బీసీ వెల్ఫేర్ హాస్టళ్లలో మెరుగైన విద్య కోసం డాక్టర్ ఎస్ఆర్ శంకరన్ రీసెర్చ్ నాలెడ్జ్ సెంటర్ ద్వారా కైకలూరు 1,2, నూజివీడు, జంగారెడ్డిగూడెం, ఏలూరు-2, ముదినేపల్లిలోని ఆరు వసతి గృహాల్లో 317 మంది డిజిటల్ క్లాసెస్‌లను నిర్వహిస్తున్నారు. 13 హాస్టళ్లల్లో మరమ్మతుల కోసం రూ.19.50 లక్షలు విడుదల చేశారు. ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 18,418 మందికి పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద 16.47 కోట్లను విడుదల చేశారు.

ఎస్సీ కార్పొరేషన్ కింద రూ.384 కోట్ల లింకేజీ రుణాలు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సంక్షేమ శాఖల్లో నిశ్శబ్దమే రాజ్యమేలింది. ఏ పథకాన్ని ముట్టుకోలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర స్వల్పకాలిక రుణాలు ఇచ్చిన జాడలు కనిపించలేదు. గడిచిన చంద్రబాబు పాలనలో 2014-19 వరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 20,121 మందికి బ్యాంక్ లింకేజీ, నాన్ బ్యాంక్ లింకేజీ కింద జిల్లాలో రూ.384.42 కోట్లు రుణాలు అందజేశారు. 2014-15లో రూ.26.46 కోట్లు, 2015-16లో రూ.36 కోట్లు, 2016-17లో రూ.67.70 కోట్లు, 2017-18లో రూ.182 కోట్లు, 2018-19లో రూ.43 కోట్ల పైబడి రుణాలను అందజేశారు.

కులవృత్తిదారులకు ప్రోత్సాహకం

2014-19 కాలంలో బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ల ద్వారా కులవృత్తిదారులతో ఫెడరేషన్‌లు ఏర్పాటు చేసి.. ఆయా వర్గాల్లోని ఒకే వృత్తిదారులతో సమాఖ్యలు ఏర్పాటు చేశారు. రజక, నాయిబ్రాహ్మణ, బట్రాజు, కృష్ణబలిజ, పూసల, సగర, ఉప్పర, వడ్డెర మేదర, కుమ్మరి, శాలివాహన, విశ్వబ్రాహ్మణ, తాటి టాపర్స్‌లకు విరివిగా రుణాలను అందించారు. 10 మంది పైగా ఈ సంఘంలో సభ్యులైతే వారికి రుణాలను ఇచ్చి ఆయా కులాల్లో ఐక్యతకు నాంది పలికారు. బీసీ కార్పొరేషన్ కింద 200 కోట్లు మేర రుణాలు ఇచ్చారు. కాపు కార్పొరేషన్ ద్వారా 239 కోట్లు, 11 రకాల ఫెడరేషన్లకు 14 కోట్లు రుణాలు ఇచ్చారు. ఆదరణ -2 కింద 2018-19లో 10 శాతం లబ్ధిదారుల కంట్రిబ్యూషన్‌తో 17,494 మందికి 22,870 మందికి కోటి 44లక్షల 7వేల విలువైన పరికరాలను అందజేశారు.

బీసీలకు మరిన్ని కొత్త పథకాలు




ఈ ఏడాది బీసీలకు స్వయం ఉపాధి సోపానం కింద రుణాలు, జనరిక్ షాపులు, చంద్రన్న స్వయం ఉపాధి పథకం, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద బ్రాహ్మణ, క్షత్రియ, ఇతర వర్గాలకు రుణాలను అందించడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. ఆదరణ-3 కింద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. వారికి ఏమేమి అవసరమో అడిగి తెలుసుకున్నాం. త్వరలో గైడ్‌లైన్స్ వస్తాయని ఆశిస్తున్నాం.

- ఎన్.పుష్పలత, బీసీ కార్పొరేషన్ ఈడీ

290 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలతో..

ఐదు బడులకు శ్రీకారం

- నేటి మధ్యాహ్నంలోగా ఎస్ఎంసీల చైర్మన్ల తీర్మానాలు పంపాలని ఆదేశాలు



ఏలూరు అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఐదురకాల బడులతో ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణను చేపట్టిన విద్యాశాఖ జిల్లాలో కార్యాచరణను వేగవంతం చేసింది. నూతన పాఠశాలల విధానంపై ఇప్పటికే పలుమార్లు క్షేత్రస్థాయిలో కసరత్తు చేసిన విద్యాధికారులు కొన్నిచోట్ల స్థానికంగా వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి ఐదురకాల బడులకు తుదిరూపునిచ్చారు. వీటిని వేసవిసెలవుల అనంతరం ప్రారంభించేలా ఆయా పాఠశాలలకు విద్యార్థుల మ్యాపింగ్, టీచర్ పోస్టుల కేటాయింపు, మౌలిక వసతుల కల్పనపై నిర్ణయానికి వచ్చారు. జిల్లాలో మొత్తం 1609 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఇప్పటివరకు ఉండగా, వీటిలో ఏ ఒక్కదానిని మూసివేయాల్సిన పరిస్థితులు లేకుండానే అన్నింటినీ కొనసాగిస్తూ ఐదురకాల బడులతో పునర్వ్యవస్థీకరణను పూర్తి చేశారు. ఆ ప్రకారం జిల్లావ్యాప్తంగా పంచాయితీల్లో బడిఈడుగల పిల్లల సంఖ్యకు అనుగుణంగా వచ్చే జూన్ నుంచి 290 ఆదర్శ ప్రాథమిక పాఠశాల (ఎంపీఎస్)లను ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు బోధించేలా ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ పాఠశాలలకు ఐదు టీచర్ పోస్టులను కేటాయిస్తారు. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగుతున్న వీటిలో కొన్నింటికి ప్రస్తుతం ఇద్దరు టీచర్లు మాత్రమే ఉండగా, తాజాగా మరో మూడు పోస్టులను కేటాయించి, ఈ మూడు పోస్టులను త్వరలో జరగనున్న ఉపాధ్యాయుల సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌లో వెకెన్సీలుగా ప్రదర్శిస్తారు. ఇక సంతృప్తికర స్థాయిలో విద్యార్థులు లేకపోవడం, సహజసిద్ధంగా ఏర్పడిన చెరువులు, తదితర అడ్డంకుల కారణంగా విలీనానికి అవకాశం లేనిచోట ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి వరకూ కొనసాగేలా మొత్తం 932 బేసిక్ ప్రైమరీ పాఠశాల (బీపీఎస్)లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కేవలం పీపీ-1, పీపీ-2(ఎల్‌కేజీ, యూకేజీ) తరగతులు, ఒకటో తరగతి, రెండో తరగతులతో కూడిన ఫౌండేషనల్ స్కూల్స్ (ఎఫ్ఎస్)లు 107 ప్రారంభించనున్నారు. కాగా ఇప్పటికే వున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో 75 స్కూళ్లను అలాగే కొనసాగించడంతో పాటు, 239 ఉన్నత పాఠశాలలను యథాతథంగా ఉంచాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు జిల్లా సర్వోన్నతాధికారి ఆమోదముద్ర లభించింది.

తీర్మానాల అప్‌లోడ్‌కు తుదిగడువు నేడే

ఐదురకాల బడులను ఆయా పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల తీర్మానాలతో నిర్ణయించగా, క్షేత్రస్థాయి నుంచి అందిన పాఠశాలల పునర్వ్యవస్థీకరణ సరిగా జరిగిందా? లేక తప్పుదోవ పట్టించారా? అనే విషయాలను తుదిగా నిర్ధారించుకునేందుకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఇందులో భాగంగా జిల్లాలోని 1,609 పాఠశాలల ఎస్ఎంసీల చైర్మన్లు సంతకం చేసిన తీర్మానాల కాపీలను తీసుకుని శుక్రవారం మధ్యాహ్నంలోగా విద్యాశాఖ డైరెక్టరేట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యతలను హెచ్ఎంలకు అప్పగించింది. ఈ తీర్మానాలు అందినతర్వాతే పాఠ శాలలవారీగా విద్యార్థుల సంఖ్య, దానికనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్యను నిర్ధారిస్తారు. ఈ డేటాతోనే బదిలీలు, పదోన్నతులు చేపడతారు.

తల్లికి వందనం తర్వాత పరిస్థితేమిటి..

ఈనెల 23నాటికి అంటే ప్రస్తుత విద్యాసంవత్సరం చివరిరోజున ఆయా పాఠశాలల తరగతుల్లో ఉండే విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల సంఖ్యను కేడర్, సబ్జెక్టుల వారీగా వెకెన్సీలు నిర్ణయించి బదిలీలు, పదోన్నతులు చేపడతారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలందరికీ ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున ఇవ్వాల్సి ఉంది. ఇప్పుడు పునర్వ్యవస్థీకరణను ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం వున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిర్ణయిస్తుండగా, తల్లికి వందనం నగదుసాయం, విద్యార్థిమిత్ర కిట్లు అందిన తర్వాత గవర్నమెంటు స్కూళ్ల నుంచి ప్రైవేటు పాఠశాలల వైపు వెళ్లితే పరిస్థితి ఏమిటన్నది ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అప్పటి విద్యార్థులసంఖ్యకు అనుగుణంగానే టీచర్ల రేషనలైజేషన్, సర్దుబాట్లు చేపట్టాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చని భావిస్తున్నారు.



ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఇసుక రీచ్‌లను ప్రారంభించాలి

ఏలూరురూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పనకు దోహదపడేలా జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన, అనుమతించిన ఇసుక రీచ్‌లను తక్షణమే ప్రారంభించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసడాంగే, ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, నాయకులు పళ్ళెం కిషోర్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇసుక రీచ్‌లను ప్రారంభించాలని కోరుతూ ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఏలూరు జిల్లాకు చుట్టుపక్కల జిల్లాలైన కృష్ణా, తూర్పు జిల్లాల్లో ప్రభుత్వం ప్రకటించిన ధరకే ఇసుక రీచ్‌లను ప్రారంభించి ఇసుక అమ్ముతున్నారన్నారు. కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. పి.కన్నబాబు, ఎ.అప్పలరాజు, కె.కన్నయ్య, పి.జగన్నాథరావు, బి.వెంకట్రావు, ఎం.ఇమ్మానియేల్, బుగ్గల ప్రభాకర్ పాల్గొన్నారు.

లోపలి పేజీలో..

ఉద్యోగం చేస్తున్నా.. ఐటీఐ చేయొచ్చు

- సాంకేతిక విద్యలో నూతన ఒరవడి
- ప్రైవేటు విద్యార్థులకు అవకాశం

పంటలు..మంటలు

- పొగాకు రైతుల్లో నిరాశ.. ఘాటు తగ్గిన మిర్చి
- కోకోకు గిట్టుబాటు ధర ఎండమావేనా ?
- అమాంతం పెరిగిన నిమ్మ ధర

రాష్ట్రాభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

రబీలో పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర : జేసీ

ఏలూరు సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 2024-25 రబీ సీజన్‌లో పంట ఉత్పత్తులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర అందేలా జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేసినట్టు జేసీ ధాత్రిరెడ్డి గురువారం తెలిపారు. 'పప్పు ధాన్యాల కొనుగోలుకు ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా ఆర్ఎస్‌కే, సహకార సంఘాల సమన్వయంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. దళారుల బెడద లేకుండా రైతులకు న్యాయం చేసేలా ప్రతి కొనుగోలుకు బయోమెట్రిక్ తప్పనిసరిగా అమలు చేస్తున్నాం. దెందులూరు, పెదపాడు, ఏలూరు మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 1,922 మెట్రిక్ టన్నుల పెసలను సేకరించాలనే లక్ష్యాన్ని నిర్ధారించగా ఇప్పటికే లక్ష్యాన్ని అధిగమించి 2,095 మెట్రిక్ టన్నుల పెసలను కొనుగోలు చేశారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన వినతుల మేరకు ప్రతి పాదనలు పంపగా లక్ష్యాన్ని 2,745 మెట్రిక్ టన్నులకు పెంచుతూ ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సమాచారం /ఫిర్యాదుల నిమిత్తం జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ నంబరు: 08812-230448, 7702003584, 7569562076, 7569597910లలో సంప్రదించాలన్నారు.



గిట్టుబాటు ధర దక్కక నష్టాలు మూటగట్టుకుంటున్నామని వాణిజ్య పంటలైన పొగాకు, మిర్చి, కోకో రైతులు ఆందోళన చెందుతున్నారు.. సీఎం రాక సందర్భంగా వారి సమస్యలపై ఆన్‌లైన్ ఫోకస్

పొగాకు రైతుల్లో నిరాశ

పెరిగిన పంట దిగుబడి

కలిసిరాని ధరలు..

కిలో సరాసరి ధర రూ.278, కనిష్ఠం రూ.265, గరిష్ఠం రూ.290

ఇవే ధరలు కొనసాగితే తీవ్ర నష్టాలు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది పొగాకు ధరలు అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. మార్చి 24న ప్రారంభమైన పొగాకు కొనుగోళ్ల మొదటి రోజునే రైతులకు తీవ్ర నిరాశను మిగిల్చాయి. అప్పటి నుంచి ధరలు ఏమాత్రం పెరగలేదు. కిలో పొగాకుకు యావరేజ్ ధర రూ.278 రాగా కనిష్ట ధర రూ.265 కాగా గరిష్ట ధర రూ.290 పలుకుతోంది. ఇవే ధరలు కొనసాగితే రైతులు తీవ్ర స్థాయిలో నష్టాల బాట పట్టాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జంగారెడ్డిగూడెంలోని పొగాకు కేంద్రం (18) పరిధిలో 12.64 మిలియన్ల పొగాకు పండించాలని రైతులకు బోర్డు కోటా నిర్దేశించగా రైతులు 18 మిలియన్ల పొగాకు పండించారు. గత నెల 24 నుంచి ఈ నెల తొమ్మిదో తేదీ నాటికి 5 లక్షల కిలోల పొగాకును బయ్యర్లు కొనుగోలు చేశారు. జంగారెడ్డిగూడెం పొగాకు కేంద్రం (32) పరిధిలో 13.15 మిలియన్ కిలోల పొగాకు పండించాలని బోర్డు సూచించగా దాదాపు దాదాపు 19.5 మిలియన్ కిలోల పొగాకు అదనంగా పండించారు. ఇప్పటి వరకు 5 లక్షల కిలోల పొగాకు కొనుగోలు జరిగిందని వేలం కేంద్ర అధికారులు బి.శ్రీహరి, జె.సురేంద్ర కుమార్ తెలిపారు.

అదనపు పంటతో చిక్కులు

పొగాకు బోర్డు అధికారులు ఇచ్చిన కోటా మేర కంటే పట్టణంలో ఉన్న రెండు వేలం కేంద్రాల పరిధిలో దాదాపు 12 మిలియన్ల కిలోల పొగాకు రైతులు అదనంగా పండించారు. అంతేకాకుండా గత రెండేళ్ల పొగాకు ధరలను చూసిన కొత్త రైతులు వేరే పంటలను తొలగించి పొగాకు సాగు చేశారు.కొన్ని చోట్ల ఎకరం రూ.70 వేల నుంచి రూ.లక్ష రూపాయలు కౌలుకు తీసుకుని సారం లేని భూముల్లో పొగాకును పండించడం వల్ల లోగ్రేడు పొగాకు పండింది. అనుమతి లేకుండా పంటలు వేయడం, అనధికార బ్యారన్లు పెరిగిపోవడంతో ప్రతీ సంవత్సరం నిబంధనలకు అనుగుణంగా పొగాకు పండించే చిన్న చిన్న రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశాలున్నారు.

రెండేళ్లగా అంతర్జాతీయ స్థాయిలో బ్రెజిల్, జింబాబ్వే వంటి దేశాల్లో పొగాకు పంట ఆశించినంతగా పండకపోవడంతో అధిక ధరలు వచ్చాయి. ఈ ఏడాది ఆశించినదానికంటే 20 శాతం అదనంగా పండింది. అందువల్ల రైతులు ఆశించినంత ధరలు రాకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. రైతులు పొగాకులో హీట్, సాఫ్ట్ లేకుండా గ్రేడ్‌ల ఆధారంగా పొగాకును సిద్ధం చేసుకోవాలి. పురుగుమందులు, ఎటువంటి అవ శేషాలు లేకుండా ఎగుమతికి ఆమోద యోగ్యంగా ఉండే పొగాకును పండించాలి. క్యూరింగ్ మీటర్లు తప్పనిసరిగా ఉపయోగించాలి. వేలం కేంద్రాలకు ముందు రోజు వచ్చి ఏ ధరకు ఎలాంటి పొగాకు వెళ్తుందో మార్కెట్‌కు అనుగుణంగా సూచనలు పాటిస్తే రైతులకు మంచి ధర వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని బోర్డు అధికారులు చెబుతున్నారు.



• ఇవే ధరలు ఉంటే నష్టమే

మంచి పొగాకుకు కూడా రూ.260 నుంచి రూ.270 మాత్రమే ధర వస్తుంది. ఒకటో రెండు బేళ్లకు మాత్రమే రూ.290 ధర వస్తుంది. ఎన్నో ఆశలతో పొగాకు పంట పండించాం. ఈ ధరలు పెరగక పోతే తీవ్ర నష్టాలు ఎదుర్కొంటాం. కూలీల ఖర్చు, బ్యారన్ పుల్లఖర్చు అధికమై పోయింది. ఇవే ధరలు కొసాగితే కనీస పెట్టు బడులు కూడా రావు. బేళ్లలో ఎక్కువ శాతం వెనక్కి వచ్చేస్తున్నాయి. యావరేజ్ ధర రూ.350కు తగ్గకుండా ఉంటే కనీస ఖర్చులైనా వస్తాయి.

-కొడవటి సత్తిరాజు, రైతు, తాడువాయి, జంగారెడ్డిగూడెం మండలం



• 50 శాతం వెనక్కు వచ్చేస్తున్నాయి

పొగాకు ధరలు చాలా తక్కువగా ఉన్నాయి. ఈ ధరల వల్ల రైతుకు ఏమాత్రం లాభం రాక పోగా అధిక శాతం నష్ట పోతాం. బోర్డుకు తీసుకు వెళ్లిన బేళ్లలో యాభై శాతం వెనక్కి వచ్చే స్తున్నాయి. రవాణా ఖర్చు కూడా నష్టమే. ఇప్పటికే ఐదు ఎకరాల పొగాకు పంటకు తెగులు వచ్చి పంటంతా పోయింది. చేతికి అందిన పంట కైనా గిట్టుబాటు ధరలు వస్తే కాస్త ఊరటగా ఉంటుంది.

- గోలి రామకృష్ణారెడ్డి, రైతు, పేరంపేట, జంగారెడ్డిగూడెం మండలం



జంగారెడ్డిగూడెం పొగాకు కేంద్రంలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

నిమ్మ రైతుల్లో ఆనందం

అమాంతం పెరిగిన ధర

ఏలూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గిట్టుబాటు ధరను మించిన ధర దక్కుతోందని సంతోషపడాలా,దిగుబడి తగ్గిందని బాధపడాలా తెలియని పరిస్థితిలో నిమ్మ రైతులు ఉన్నారు. నిమ్మకాయలకు ప్రస్తుతం ధర బాగానే పలుకు తోంది. రెండేళ్లుగా నష్టాలు కూడగట్టుకున్న రైతులకు ఇప్పుడు గిట్టుబాటు ధర దక్కుతుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబరు నుంచి జనవరి వరకు వర్షాలు, మంచు, తేమ కారణంగా పూత, పిందె దెబ్బతినడం, తెగుళ్ల సోకడంతో దిగుబడిపై ప్రభావం పడింది. వేసవి ప్రభావంతో నిమ్మకాయల ధర పెరిగింది. వడగాడ్పులు పెరిగే కొద్దీ ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో ఏలూరు, దెందులూరు, ద్వారకా తిరుమల తదితర ప్రాంతాల్లో నిమ్మ సాగు జరుగుతుంది. ఏలూరు నిమ్మకాయల మార్కెట్‌కు రోజూ రెండు వేల క్వింటాళ్ల దాకా నిమ్మకాయలు వస్తున్నాయి. ప్రస్తుతం కిలో నిమ్మకాయలు 120 రూపాయలకు చేరింది. గతనెలలో కిలో రూ.50 ఉండగా, ప్రస్తుతం రూ.120 దాకా ధర పెరగడంతో నిమ్మ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



అయితే దిగుబడి తగ్గడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి వసతి ఉన్న తోటలకు ఈ ఏడాది కాపు బాగానే ఉంది. అయితే ఎండు తెగులు, మంగు వెంటాడుతున్నాయి. రిటైల్ మార్కెట్‌లో ఒక్కో నిమ్మకాయ సైజును బట్టి ఐదు నుంచి పది రూపాయల వరకు అమ్ము తున్నారు. ప్రస్తుతం 30 నుంచి 40 శాతం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది.మిగతాది స్థానిక మార్కెట్ రిటైల్ అమ్మకాల కోసం వెళ్తుంది. దిగుబడి తగ్గడంతో డిమాండ్ పెరిగింది. వర్షాలు పడినా, ఎండలు తగ్గినా వినియోగంపై ప్రభావం పడుతుంది. ధర ఉన్నప్పుడే పంటను అమ్ము కోవాలని రైతులు భావిస్తున్నారు. పిందె దశలో ఉన్న మార్కెట్‌కు తీసుకు వస్తున్నారు. కాస్త సైజులో ఉన్న కాయలకు మంచి ధర పలుకుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది రుతుపవనాలు త్వరగా వచ్చే అవకాశం ఉండడంతో నిమ్మ రైతులు వీలైనంత త్వరగా పంటను మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. రెండేళ్ల నుంచి కోలుకోలేక అవస్థలు పడుతున్న తామంతా ప్రస్తుత ధరలతో గట్టెక్కుతామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఘాటు తగ్గిన మిర్చి



- క్వింటా రూ.10 వేలు
- ఐదేళ్లలో కనిష్ఠస్థాయికి పడిపోయిన ధర
- కూలికోత ఖర్చు రూ.8 వేలు
- రైతాంగానికి మిగిలేదేమిటి..?
- అప్పుల పాలవుతున్న మిర్చి రైతాంగం

కుక్కునూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మిర్చి రైతాంగం ఈ ఏడాది కంట కన్నీరు పెడుతున్నారు. గత ఐదేళ్లలో ఎన్నడు లేని విధంగా క్వింటా మిర్చి ధర రూ.10 వేలకు పడిపోయింది. ఈ ఏడాది ఆరంభంలో క్వింటా మిర్చి రూ.12వేలు ఉండగా పంట చేతికి వచ్చే సమయంలో ప్రస్తుతం రూ.10 వేలు పలుకుతున్నట్టు రైతాంగం చెబుతున్నారు. కొనుగోలు చేయ డానికి వ్యాపారులు ముందు కు రావడం లేదని వాపో తున్నారు. క్వింటా మిర్చి కోయడానికి ఖర్చు రూ.8 వేలు అవు తుండగా రూ.10 వేలు ధర రైతాంగా నికి ఏ మాత్రం గిట్టు బాటు కావడం లేదు. ఏజెన్సీలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని గోదావరి తీరంలోని నల్లరేగడి భూముల్లో సాగయ్యే మిర్చి నాణ్యత కలిగి ఉంటుంది. గోదావరి వరదలు, వాతావరణం అనుకూలించకపోవడం, తెగుళ్ల ఉధృతి దిగుబడి తగ్గడం, ఆశించిన గిట్టుబాటు ధర లేక మిర్చి సాగు క్రమంగా తగ్గిపోతోంది. రెండు మండలాల్లో ఒకప్పుడు 15 వేల ఎకరాల్లో మిర్చి సాగు జరిగేది. ప్రస్తుతం 6 వేల ఎకరాలకు పడిపోయింది. నాలుగేళ్ల క్రితం క్విం టా మిర్చి రూ.15 వేల నుంచి రూ.18 వేలు పలికింది. గత మూడేళ్లుగా ధర పతనమవుతోంది. గత రెండేళ్ల నల్లి ప్రభావంతో ఎకరానికి పది క్వింటాలలోపు దిగుబడి మాత్రమే వచ్చినా ధర ఊరటనిస్తూ రూ.12వేల వరకు పలికిం ది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించ డంతో ఎకరానికి 15 క్వింటాలు పైగా దిగుబడి వస్తుండగా మరోవైపు ధర పతనమవుతోంది. గతంలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాల నుంచి కూలీలు మిర్చి కోతలకు వచ్చేవారు. కానీ ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో ఉపాధి పనుల కారణంగా మిర్చికోతలు కోయడానికి కూలీలు రావడం లేదు. దీంతో స్థానికంగా ఉన్న కూలీలకు డిమాండ్ పెరిగిం ది. కూలీ ధరలు పెరగ డంతో ఎకరం మిర్చి కోయాలంటే దాదాపు రూ.20 వేలు ఖర్చు అవుతోందని రైతులు వాపోతున్నారు. భూమి కౌలు, మిర్చి మొక్కలు వేయడానికి అయ్యే ఖర్చు, ఎరువులు, చీడపీడల నివా రణకు మందుల స్ప్రేయింగ్‌లు, కోతలు అన్ని కలిపి ఎకరానికి పెట్టుబడి రూ.2.5 లక్షల నుంచి 3 లక్షల వరకు అవుతుంది. కానీ ప్రస్తుతం ఎకరం మిర్చిసాగు చేస్తే లక్షన్నర నుంచి రెండు లక్షలకు పైగా నష్టం వస్తున్నట్టు రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కనీసం రూ.15 వేలు ధర ఉండాలి

క్వింటా మిర్చికి కనీస ధర రూ.15 వేలు పలికితేనే రైతాంగానికి కొంత మేలు జరుగుతుంది. పెరిగిన పెట్టుబడి, కూలీల ఖర్చు, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం నష్టపోయే పరిస్థితి. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి మిర్చి రైతాంగాన్ని ఆదుకోవాలి.

- దుద్దుకూరి శ్రీనివాసరావు, రైతు, కుక్కునూరు

కోకోకు గిట్టుబాటు ధర ఎండమావేనా ?

ఏలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది కోకో సాగు చేస్తున్న రైతులకు పంటకు గిట్టుబాటు ధర లేక గగ్గోలు పెడుతున్నారు. రైతులు, కంపెనీల మధ్యలో దళారుల ప్రమేయం వలన రైతులు నష్టపోతున్నారు. గత ఏడాది కిలో గింజలనూ రూవెయ్యికి కొనుగోలు చేయగా, ఈ సారి 500కు మించి ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. ప్రధానంగా పెదవేగి, జంగారెడ్డిగూడెంతో ఏజెన్సీ మెట్ట మండలాల్లో కోకోను అంతర పంటగా సాగుచేస్తున్నారు. కోకో పంటలకు తగిన గిట్టుబాట ధర రాక గత నెల రోజులుగా రైతులు తీవ్ర ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ నెల 7న కోకో గింజల ధర ప్రకటిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇంకా అమలు కాలేదని రైతులు వాపోతున్నారు. పాత గింజలు రూ.300, కొత్త గింజలు రూ.550కు మోండలీజ్ కంపెనీ చెప్పిన ధరలకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని చెబుతున్నారు. కోకో ధరల స్థిరీకరణ పథకం వర్తింపచేసి ఆదుకోవాలని రైతు సంఘాలు ఆందోళన బాట పట్టినా రైతులకు న్యాయం జరగడం లేదు. కోకో గింజలను కిలోకు రూ.750కు ధర కల్పిస్తే గానీ రైతుకు గిట్టుబాటు కాదని చెబుతున్నారు. నేరుగా ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కోకో గింజలను కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



మావూరమ్మకు 108 బిందెల పవిత్ర జలాలతో అభిషేకం

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు బంగారు వారి చెరువుగట్టు వద్ద ఉన్న మావూరమ్మ జాతర సందర్భంగా గురువారం ఉదయం ఆ ప్రాంతానికి చెందిన 108 మంది మహిళలు పవిత్ర జలాలను బిందెలతో తీసుకు వచ్చి అభిషేకం నిర్వహించారు. ఈనెల 13వ తేదీ నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జాతర ద్వారా అమ్మవారు కరుణించాలని కోరుతూ ప్రతీ ఏటా నిర్వహించే పవిత్ర జలాల అభిషేకం చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కర్నేన రోజారమణి, మేడిది దానయ్య కుటుంబ సభ్యులు, శ్రీలక్ష్మీ, రాజరాజేశ్వరి, జక్కారావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. వచ్చిన భక్తులు, మహిళలకు మేడిది వినేష్, శ్వేత దంపతులు అన్న ప్రసాద వితరణ గావించారు.





ఏలూరు ఉద్యాన శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కోకో రైతులు

ఉద్యాన శాఖ కార్యాలయాన్ని ముట్టడించిన కోకో రైతులు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్ర జ్యోతి) :కోకో రైతులకు నష్టం కలిగించే విధంగా కంపెనీలు చెప్పిన కోకో గింజల ధరలను ఉద్యానశాఖ అధికారులు ప్రచారం చేయడం, కంపెనీలకు అనుకూలంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఏలూరు ఉద్యాన శాఖ అధికారి కార్యాలయాన్ని గురువారం ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం ఆధ్వర్యంలో కోకో రైతులు ముట్టడించారు. కంపెనీలకు అనుకూలంగా అధికారుల ప్రచారంతో తాము నష్టపోతున్నామంటూ కోకో రైతులు ధర్నా జరిపారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. న్యాయం కోసం పోరాటం చేస్తామని సంఘ నాయకులు హెచ్చరించారు. మోండలీజ్ కంపెనీ రేట్ల ప్రచారం నిలుపుదల చేస్తామని ఉద్యానశాఖ అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. కోకో రైతు సంఘ నాయకులు బొల్లు రామకృష్ణ, కె.శ్రీనివాస్, గుది బండి వీరారెడ్డి, కోనేరు సతీష్‌బాబు, పానుగంటి అచ్యుతరామయ్య, కె.రామిరెడ్డి, కొసరాజు రాధాకృష్ణ పాల్గొన్నారు.

కాకినాడ టు గన్నవరం

సరిహద్దుల్లో పాగా..ఐపీఎల్ బెట్టింగ్‌లు

పోలీసుల అదుపులో ఎనిమిది మంది

రూ.2.90 లక్షలు, ఇతర వస్తువులు సీజ్

కాకినాడలో ప్రధాన బుకీ పరార్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లో ప్రధాన బుకీలు, సబ్ బుకీలకు కృష్ణాజిల్లా కేంద్రంగా మారుతోంది. సరిగ్గా సరిహద్దుల్లో పాగా వేసిన బుకీలు ఐపీఎల్‌లో పందేలను పరుగులు తీయిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం అవనిగడ్డకు చెందిన ఐదుగురు బుకీలు, ప్లంటర్లను విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తాజాగా గన్నవరం కేంద్రంగా బెట్టింగ్‌లను జోరుగా నిర్వహించిన ఎనిమిది మంది గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. బుకీలను పట్టుకున్న తర్వాత దర్యాప్తు చేస్తున్న పోలీసులకు కొత్తకొత్త విషయాలు తెలుస్తున్నాయి. జిల్లాలో మండల, గ్రామీణ స్థాయిలో సబ్ బుకీలు, ప్లంటర్లకు పెద్ద నెట్‌వర్క్ నడుస్తున్నట్టు గుర్తించారు.

'రాధే'లో రయ్‌రయ్..

గన్నవరంతో పాటు మండలంలోని అల్లాపురం, అజ్జంపూడి గ్రామాల్లో ఉన్న బుకీల నెట్‌వర్క్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బట్టబయలు చేశారు. పటమట పోలీసు స్టేషన్ పరిధిలోని సరిహద్దులకు వచ్చి బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న సబ్ బుకీని అదుపులోకి తీసుకోగా, గ్యాంగ్ అసలు బాగోతం బయటపడింది. ఈ గ్యాంగ్‌కు సూత్రధారి కాకినాడకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడు తయారు చేయించిన రాధే ఎక్స్ఛేంచ్ యాప్‌లో మొత్తం బెట్టింగ్ వ్యవహారం నడుస్తున్నట్టు నిర్ధారించారు. ఈ యాప్‌ను గన్నవరంలోని అల్లాపురానికి చెందిన కిరణ్, అజ్జంపూడికి చెందిన కొసరాజు వెంకట సూర్యారావును భాగస్వాములుగా తీసుకున్నారు. కిరణ్‌కు మచిలీపట్నంలో బంగారం పూత పనిచేసే కేతవరపు భానుప్రకాష్ బావమరిది అవుతాడు. మచిలీపట్నంలో పని లేకపోవడంతో కిరణ్ అతడిని గన్నవరం రప్పించుకున్నాడు. భాగస్వామిగా ఉన్న వెంకట సూర్యారావుతో భానుప్రకాష్‌కు లైన్ ఇప్పించాడు. భానుప్రకాష్. ఎనికేపాడు సమీపంలోని ఓ పాఠశాల నుంచి బెట్టింగ్ నిర్వహిస్తుండగా, పక్కా సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అతడి ఫోన్ ద్వారా ఒక్కో లింక్‌ను ఛేదించుకుంటూ వెళ్లిన పోలీసులు కిరణ్, అతడికి బెట్టింగ్ డబ్బును వసూలు చేసే జోస్ అనే వ్యక్తిని, బెట్టింగ్ ఆడుతున్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. ఇందులో కిరణ్‌కు భాగస్వామిగా ఉన్న కొసరాజు వెంకట సూర్యారావు.. పోలీసులను చూసి రెప్పపాటు వ్యవధిలో పరారయ్యాడు. ఈ నలుగురు కాకుండా గన్నవరంలో ఈ రాధే యాప్‌తో అనుసంధానమైన మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. యాప్‌లో ఉన్న ఖాతాలో మొత్తం రూ.2.90 లక్షల వరకు ఉన్నట్టు గుర్తించారు. వారి దగ్గర నుంచి ఓ ల్యాప్‌టాప్, 18 సెల్‌ఫోన్లు, రూ.12,000 స్వాధీనం చేసుకున్నారు. యాప్ ఖాతాలో ఉన్న నగదును స్తంభింప చేయించారు.

కాకినాడతో ప్రధాన బంధం

కిరణ్, కొసరాజు వెంకట సూర్యారావుకు కాకినాడకు చెందిన ఓ వ్యక్తితో సంబంధాలు ఉన్నాయని పోలీసులు గుర్తించారు. అతడిని పట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తుండగా, ఆ వ్యక్తి సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసి పరారైనట్టు సమాచారం. పోలీసులు గాలిస్తున్నారు.

15 నుంచి సముద్రంలో చేపల వేటపై నిషేధం

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మత్స్య సంపద పరిరక్షణ, ప్రభావవంతమైన నిర్వహణ కోసం తీరంలోని ప్రాదేశిక జలాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. సాంప్రదాయ పడవలు మినహాయించి, ఔట్ బోర్డ్, ఇన్‌బోర్డ్ ఇంజన్లు అమర్చిన మోటరైజ్, మెకనైజ్డ్ బోట్లతో 61 రోజులపాటు తూర్పు తీర సముద్ర జలాల్లో మత్స్య సంపద వేటపై నిషేధం అమలులో ఉంటుందని పేర్కొంది.

21న మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 20న నిర్వహించదలచిన ప్రవేశ పరీక్షను 21వ తేదీకి మార్చినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామ రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 20న ఈస్టర్ పర్వదినం రావడంతో ఈ మేరకు మార్పు చేసినట్టు తెలిపారు.

మూడు పంటలతో స్థూల ఆదాయం : అగ్రి డైరెక్టర్

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పంటల ద్వారా రాష్ట్ర స్థూల ఆదాయం పెంపునకు కృషి చేయాలని, స్థూల విలువ పెంపుదలకు చేపట్టాల్సిన కార్యాచరణపై వర్క్‌షాప్‌లు నిర్వహించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, విత్తనాభివృద్ధిశాఖ అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూముల్లో పంటల సాంద్రత ఎక్కువగా ఉంచడం, స్వల్ప, మధ్యకాలిక పంటలతో ఏడాదిలో మూడు పంటల సాగు విధానం, అంతర పంటలు, మిశ్రమ పంటల సాగకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

ఉపాధ్యాయులకు పారితోషికం చెల్లించాలి

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా పత్రాల మూల్యాం కనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి వెంటనే పారితోషికాలు చెల్లించాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి కోరారు. గురువారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రూ.35 కోట్లు త్వరలో విడుదల చేస్తామని వారికి ఆయన హామీ ఇచ్చారు.

జాతీయస్థాయి అండర్-19 క్రికెట్ టీమ్‌కి షేక్ సమీరుద్దీన్



పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పాలకొల్లుకు చెందిన యువ క్రికెటర్ షేక్ సమీరుద్దీన్ అండర్ -19 నేషనల్ క్రికెట్ టీమ్‌కు ఎంపికయ్యాడు. సమీరుద్దీన్ మేన మామ షేక్ సల్మాన్ బాజీ గురువారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. సమీరుద్దీన్ ఇంటర్నేషనల్ ఇండో, నేపాల్‌కప్ ఛాంపియన్ షిప్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఇండియా తరపున ఆడేందుకు ఎంపికయ్యాడని తెలిపారు. మే 26వ తేదీ నుంచి 31 వరకూ నేపాల్‌లో జరిగే పోటీల్లో ఆల్ రౌండర్‌గా హాజరు కానున్నాడని తెలిపారు. క్రికెట్‌లో పీడీ రామకృష్ణ, మణికంఠల వద్ద శిక్షణ పొందాడు. సమీరుద్దీన్‌ను పట్టణ ప్రముఖులు అభినందించారు.

మిస్ తెలుగు యుఎస్ఏ పోటీల్లో వీరవాసరం అమ్మాయి



వీరవాసరం (భీమవరం అర్బన్), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పల్లెటూరులో పెరిగింది ఉన్నత చదువు కోసం విదేశం వెళ్లిన వీరవాసరం మండలం రాయికుదురు గ్రామానికి చెందిన కొత్తపల్లి చూర్ణికప్రియ అమెరికాలో జరిగిన అందాల భామ పోటీలో ఫైనల్ జాబితాలో చెరింది. అమెరికాలో ఎమ్మెస్ చదువుతున్న చూర్ణికప్రియ తెలుగు సంఘం ఆధ్వర్యంలో డల్లాస్‌లో నిర్వహించిన మిస్ తెలుగు యూఎస్ఏ -2025 పోటీల్లో పాల్గొని ఫైనల్స్‌కు చేరింది. మే 25న జరిగే గ్రాండ్ ఫినాలేలో 20 మంది అమ్మాయిలతో పోటీ పడనున్నారు. చూర్ణికప్రియ చిన్నతనం నుంచి ఇప్పటి వరుకు భరతనాట్యంలో 200 పైగా స్టేజ్ షోలు నిర్వహించారు.

24 నుంచి చైతన్య భారతి జాతీయస్థాయి నాటిక పోటీలు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 24 నుంచి 27వ తేదీల్లో భీమవరం చైతన్య బారతి నాటికల పోటీలను నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షులు, కార్యదర్శులు రాయప్రోలు భగవన్, మంతెన రామ్ కుమార్ రాజులు తెలిపారు. భీమవరంలోని డీఎన్ఆర్ కళాశాల గన్నాబత్తుల వారి క్రీడా మైదానంలో చైతన్య భారతి, సంగీత నృత్య నాటక పరిషత్ 18వ జాతీయ స్దాయి నాటిక పోటీల కళా వేదికను గురువారం పరిషత్ సభ్యులు శంకుస్దాపన చేశారు. 17ఏళ్లుగా నాటక పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ స్దాయి నాటక పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు, బోండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణవర్మ, పెన్నాడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



పోటీల వేదికకు శంకుస్థాపన చేస్తున్న పరిషత్ సభ్యులు

చెరువుగట్టుపై వందేళ్లనాటి చెట్లు నరికివేత

వచ్చిన నగదు రూ.2.80 లక్షలు స్వాహా

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన

ఆర్టీఐ యాక్టివిస్ట్ కొత్తపల్లి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుమలంపాలెం గ్రామంలో నారప్ప చెరువు గట్టుపై ఉన్న సుమారు వందేళ్ల వయసున్న 15 చెట్లను కొందరు అక్రమంగా నరికివేసి వచ్చిన సొమ్మును స్వాహా చేశారని పర్యావరణ పరిరక్షణ,ఆర్టీఐ ఏక్టివిస్ట్ కొత్తపల్లి చంద్రమౌళి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కొందరు గ్రామస్థులు ఇప్పటికే గ్రామ కార్యదర్శికి, వీఆర్వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారిపై ఏ విధమైన చర్యలు తీసుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామం లోని ప్రముఖులు, అధికారులు ఈ చెట్లను రూ.2.80 లక్షలకు మండలంలోని పంగిడి గూడేనికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించార న్నారు. ఆ నగదు సదరు వ్యక్తులు స్వాహా చేశారని ఫిర్యాదులో వివరించారు. ఈ ఘటన జరిగి వారం రోజులైనా మౌఖిక ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థాయిలో అధికారుల చేతివాటమే ఇందుకు కారణమని ఆరోపించారు. పచ్చని చెట్లను నరికి పర్యావరణానికి చేటు తెచ్చిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.



ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెంలో అక్రమంగా నరకిన చెట్లు

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్ రెడ్డి



తణుకులో సీసీ రహదారి ప్రారంభిస్తున్న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్ రెడ్డి

తణుకు / తణుకు రూరల్ / ఇరగవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. నియోజకవర్గంలో గురువారం పలు అభివృద్ధి పనులు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అమరావతికి ప్రధాని మోదీని తీసుకువచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధికి ప్రణాళిక రూపొందించారని అన్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ నియోజకవర్గ అభివృద్ధికి ఎక్కువ నిధులు తీసుకొస్తున్నారని చెప్పారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ వైసీపీ నాయకులు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు.

పట్టణంలోని 30, 34 వార్డులలో సీసీ రోడ్లు, 28వ వార్డులో సీసీరోడ్డు, డ్రెయిన్, డిగ్రీ కాలేజీలో వాకింగ్ ట్రాక్ పనులకు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్ రెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ శంకుస్థాపన చేశారు. 25వ వార్డులో నిర్మించిన గ్రంథాలయం ప్రారంభించారు. వేల్పూరులో రూ. 6.8 కోట్లతో నిర్మించిన రహదారి, రూ. 1.5 కోట్లతో ఆధునీకీకరించిన విద్యుత్ సబ్‌స్టేషన్, విష్ణు ప్రియ నగర్‌లో రూ. 60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అగ్గిరాయి చెరువు వద్ద రూ.25 లక్షలతో నిర్మించే వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇరగవరం మండలం కె.ఇల్లిందలపర్రులో రూ.3.80 కోట్లతో రోడ్డు, ఏలేటిపాడులో రూ.కోటి, అయితంపూడిలో రూ.4.90 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, ఆర్డీవో కతీప్ కౌసర్ బానో, వివిధ శాఖల అధికారులు, జడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు ఐ.శ్రీదేవి, నార్ని తాతాజీ, ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ, ఆనాల ఆదినారాయణ, ఒమ్మి రాంబాబు, తాతపూడి మారుతీరావు, సర్పంచ్ వి.కృష్ణవేణి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణంలో జాప్యం.. మంత్రి జనార్దన్‌రెడ్డి ఆగ్రహం

తణుకు పట్టణంలో ఫ్లైఓవర్ నిర్మాణం ఆలస్యం కావడంపై నేషనల్ హైవే అధికారులపై మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైవే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నిర్మాణ పనులు జాప్యం కావడంపై వివరణ ఇవ్వాలన్నారు. సంబంధిత కాంట్రాక్టరుకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రోడ్ల అభివృద్ధిపై ఆశాఖ ఉన్నతాధికారులతో చర్చించారు.

ఉద్యోగం చేస్తున్నా..

కెరీర్

ఐటీఐ చేయొచ్చు



సాంకేతిక విద్యలో నూతన ఒరవడి

పదో తరగతి ఆపై విద్యార్హతలతో వివిధ ప్రైవేటు కంపెనీల్లో సాంకేతిక విభాగాల్లో పనిచేస్తున్న యువత నేరుగా ఐటీఐ కోర్సులు చదివే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వ ఐటీఐల్లో మిగిలిన సీట్లు వారికి కేటాయించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పని నైపుణ్యం గల వారికి ప్రవేశం కల్పించి వారాంతపు లేదా కాంటాక్ట్ తరగతులు నిర్వహిస్తారు నేరుగా తుది పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు. ఉత్తీర్ణులకు సాంకేతిక విద్యా శాఖ సర్టిఫికెట్లు జారీ చేస్తుంది. ఉన్నత విద్య, ఉద్యోగోన్నతికి సర్టిఫికెట్ ఉపయోగపడుతుంది.

- ప్రైవేటు విద్యార్థులకు అవకాశం
- ప్రభుత్వ ఐటీఐలలో మిగిలిన
- సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
- విద్యార్హత యథాతథం
- పని అనుభవం ధ్రువీకరణ కావాలి

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటుగా ఐటీఐ చేయడానికి నిర్ణీత అర్హత గల అభ్యర్థులకు సాంకేతిక విద్యాశాఖ వెసులుబాటు కల్పించింది. పదో తరగతిల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు వివిధ ట్రేడ్‌లలో ఐటీఐ చదవొచ్చు. ప్రభుత్వ ఐటీఐలలో ప్రవేశాలకు పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నా ఏటా వందల్లో సీట్లు మిగిలిపోతున్నాయి. ఎటువంటి సాంకేతిక విద్యార్హత లేకుండా పలు కంపెనీలు, సంస్థల సాంకేతిక విభాగాల్లో నైపుణ్యం గల సిబ్బంది ఉన్నారు. ఐటీఐలో మిగిలిన సీట్లలో ఇలాంటి వారికి ప్రవేశం కల్పించే అవకాశం కల్పించారు. వారాంతపు లేదా కాంటాక్ట్ తరగతుల్లో థియరీ క్లాసులు నిర్వహించి, నేరుగా తుది పరీక్షలకు అనుమతిస్తారు. ఉత్తీర్ణులకు ప్రభుత్వ సాంకేతిక విద్యా శాఖ నుంచి రెగ్యులర్ విద్యార్థుల మాదిరిగానే ఐటీఐ అర్హత ధ్రువీకరణపత్రాలు జారీ చేయవచ్చని ప్రభుత్వం భావించింది. ఆయా ట్రేడ్, వృత్తుల్లో ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలతో వారికి ఉద్యోగోన్నతి, మంచి జీతభత్యాలు అందుకునే అవకాశం ఉంటుంది. ఆసక్తివున్నవారు బ్యాంకుల నుంచి రుణసౌకర్యాన్ని వినియోగించుకుని స్టార్టప్ ప్రారంభించడానికి ప్రోత్సాహకరంగా ఉంటుందని చెబుతున్నారు.

ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే..

తాజాగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయంప్రకారం ప్రస్తుత విద్యాసంవత్సరం (2024-25)లో ప్రభుత్వ ఐటీఐలలో వివిధ ట్రేడ్‌లలో మంజూరైన సీట్లకు నాలుగు విడతల్లో నిర్వహించిన ప్రవేశ కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సీట్లను ప్రైవేటుగా ఐటీఐ చదవాలనుకునే అభ్యర్థులకు కేటాయించనున్నారు. ప్రైవేటు అభ్యర్థుల ప్రవేశాలకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూనే ప్రాక్టికల్స్ శిక్షణ పొందుతున్న వారికి థియరీ తరగతులపై విధివిధానాలు అందాల్సి ఉందని ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్/అడ్మిషన్ల కన్వీనర్ పి.రజిత తెలిపారు.

జాతీయస్థాయిలో ఆలిండియా గ్రేడ్ పరీక్ష-2025 నేరుగా రాసేందుకు జిల్లాలోని ఆరు ప్రభుత్వ ఐటీఐలలో ఆయా ట్రేడ్‌లలో అందుబాటులోవున్న సీట్లకు అర్హులైన ప్రైవేటు అభ్యర్థులకు నిబంధనలకనుగుణంగా ప్రవేశం ఇస్తామన్నారు. ఐటీఐకు సంబంధించిన ట్రేడ్‌లో నైపుణ్యం కలిగి ప్రైవేటుగా పనిచేస్తున్నవారికి, అప్రెంటిస్ ట్రైనింగ్ ఇస్తోన్న కంపెనీలు, ఎంఎస్ఎంఈలు, రిజిస్టర్డ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లలో అభ్యర్థులకు ఆయా కేటగిరీలకు అనుగుణంగా ఏడాది నుంచి మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. కంపెనీ, ట్రేడ్ తదితర వివరాలు, ధ్రువీకరణ పత్రాలు, సర్వీసు సర్టిఫికెట్‌తో దరఖాస్తులను సమీప ప్రభుత్వ ఐటీఐలలో ఈ నెల 12 సాయంత్రం 5 గంటల్లోగా అందజేయాలి. ఈ వెసులుబాటుతో కూడిన అడ్మిషన్లు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఐటీఐలలో మిగిలివున్న సీట్లకు మాత్రమే వర్తింస్తుందన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి ప్రభుత్వం మళ్లీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్ నెంబరు 08812-230269లో సంప్రదించాలని కోరారు. ఏలూరు జిల్లాలోని 6 ప్రభుత్వ ఐటీఐలలో 8 ట్రే డ్‌లలో ప్రైవేటు అభ్యర్థులుగా అడ్మిషన్లు ఇచ్చేందుకు మొత్తం 152 సీట్లు ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలోని ఒక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 10 సీట్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

రొయ్య రైతులను ఆదుకునేందుకు చర్యలు

20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్



సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్

భీమవరం టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అత్యధికంగా రొయ్యల సాగు చేస్తున్న జిల్లాలోని రైతులు అమెరికా ఆంక్షల నుంచి సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అనువైన చర్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ తెలిపారు. జిల్లాలో కేంద్ర పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలపై కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి సమీక్షించారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్, సీఎం చంద్రబాబు విజన్ 2047 లక్ష్యంతో కార్యాచరణ అమలు చేయాలన్నారు. పేదల గృహనిర్మాణం, లక్‌పతి, గ్రామీణ సడక్ యోజన, గ్రామీణ ఉపాధి హామీ, జల జీవన్ పథకం, సూర్యఘర్, విశ్వకర్మ, గోకుల్ మిషన్, తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. మరోసారి జరిగే సమావేశానికి ప్రస్తుతం చర్చించిన అంశాలపై పురోగతి నివేదిక రావాలని ఆయన అధికారులకు సూచించారు. ఆయనతో పాటు కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, ఎమ్మెల్సీ వంకా రవీంద్ర ఉన్నారు. ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సీపీవో కె.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జేడీ జడ్డు వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, డీఆర్డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణు గోపాల్, జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనే జర్ మంగపతిరావు, డీపీవో అరుణశ్రీ, డీఎస్‌వో ఎస్.సరోజ, మత్స్యశాఖ అధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆక్వా క్రాప్ హాలిడే ప్రకటిస్తాం

13న భీమవరంలో ఆక్వా రైతు మహాసభ

పాలకొల్లు ఆక్వా సంఘ చైర్మన్ గాంధీ భగవాన్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఆక్వా సంఘం చైర్మన్ గాంధీ భగవాన్‌రాజు

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆక్వా క్రాప్ హాలీడే దిశగా రైతులు నిర్ణయం తీసుకోనున్నారు. పాలకొల్లులో ఈ నెల 7న జై భారత్ క్షీరారామ ఆక్వా సంఘం ఆధ్వర్యంలో జరిగిన రైతు మహాసభలో క్రాప్ హాలిడే నిర్ణయం తీసుకున్నారు. అమలు, విధి విధానాలు ఖరారు చేయడానికి ఈ నెల 13న మరోసారి సమావేశం కానున్నట్లు జైభారత్ క్షీరారామ ఆక్వా సంఘం చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రాప్ హాలిడేపై సంఘ సభ్యులు, ముఖ్య నాయకులతో చర్చించామన్నారు. ఇద్దరు సభ్యులతో గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి చెరువులు, రైతుల వివరాలను నమోదు చేస్తామన్నారు. హేచరీలు, రొయ్య కొనుగోలు చేసే ప్రాసెసింగ్ ప్లాంట్‌ల వరకూ సిండికేట్‌గా ఆక్వా రైతులను 30 ఏళ్లగా దోపిడీ చేస్తున్నారన్నారు. క్రాప్ హాలిడే ఒక గుణపాఠం కావాలన్నారు. సంఘం పరిధిలోని పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గాల్లో మూడు నెలలు క్రాప్ హాలిడే పాటిస్తామన్నారు. భీమవరంలో ఈనెల 13న డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామరాజు ఆధ్వర్యంలో జరిగే ఆక్వా రైతుల సమావేశానికి పెద్ద సంఖ్యలో రైతులు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. సమావేశంలో సంఘ సభ్యులు పెన్మెత్స సత్యనారాయణరాజు, కర్నేన గౌరునాయుడు, మేడిద జాన్‌రాజు, రుద్రరాజు సత్యనారాయణరాజు, అంగర వరప్రసాద్, మేకా ఫణీంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మంచినీటి పథకం లీకేజీలను సరిచేస్తాం

నరసాపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మణేశ్వరం భారీ మంచినీటి ప్రాజెక్టులో రూ 2.06కోట్లతో చేపట్టిన రా ఫిల్టర్ బెడ్ నిర్మాణ పనుల్లో తలెత్తిన లోపాలపై అధికారులు స్పందించారు. 'ఇదేమి నిర్మాణం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. డీఈ శ్రీనివాస్ పనులను పరిశీలించి నిర్మాణ సమయంలో ఎయిర్‌బ్లాక్స్‌గా గుర్తించారు. దీనితో చిన్న బీటలు వస్తాయన్నారు. ప్రస్తుతం వచ్చిన బీటలు కూడా అటువంటివై అయి ఉండవచ్చునన్నారు. వాటిని సరి చేయిస్తామన్నారు. పనుల్లో ఎటువంటి నాణ్యత లోపం లేదని ఆయన స్పష్టం చేశారు.

ఏలూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఏలూరు మీదుగా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. చర్లపల్లి నుంచి శ్రీకాకుళం రోడ్డుకు ఈనెల 11 నుంచి జూన్ 21 వరకూ ప్రతి శుక్రవారం (12 సర్వీసులు) నడపనున్నారు. శ్రీకాకుళం రోడ్డు నుంచి చర్లపల్లికి ఈనెల 12 నుంచి జూన్ 28 వరకూ ప్రతి శనివారం (12 సర్వీసులు) నడపనున్నట్లు తెలిపారు. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో ఆగనున్నాయని తెలిపారు. ఫస్ట్ క్లాస్ ఏసీ, సెకండ్ క్లాస్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని తెలిపారు.

గిరిజన బాలిక ప్రసవం

శిశువు మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన విద్యార్థిని (15) బాలిక గర్భం దాల్చడంతో ఏలూరులోని ఒక ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ గురువారం తెల్లవారుజామున ప్రసవం కాగా శిశువు వెంటనే మరణించింది. వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేశారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసపత్రికి మార్చురీకి తరలించారు. బుట్టాయిగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థిని గర్భం దాల్చడానికి కారకుడిపై బుట్టాయిగూడెం పోలీసులు కేసు నమోదుచేశారు.

శిశువు అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భార్యా భర్తల మధ్య గొడవలు జరిగిన నేపథ్యంలో అనారోగ్యంతో జన్మించిన శిశువు మరణించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరులోని టైటస్ నగర్‌కు చెందిన పిడుగు సలోమి (29), భర్త సునీల్ కుమార్ ఉన్నారు. మొదట గర్భం దాల్చిన సలోమికి బిడ్డ జన్మించగా మరణించింది. మళ్ళీ గర్భందాల్చి ఇటీవల ప్రసవించింది. ఆ బిడ్డ జన్యుపరంగా అనారోగ్యంతో జన్మించడంతో విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ శిశువు మరణించింది. భార్యా భర్తల మధ్య గొడవలు ఉండడంతో ఈ సంఘటనపై సలోమి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసులు ఆ పసి శివు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ శిశువుకు గురువారం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పెళ్లి కార్డులు ఇవ్వడానికి వెళ్లి.. తిరిగిరాని లోకాలకు

- మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న కారు
- వరుడి తండ్రి, బంధువు మృతి
- కొమిరేపల్లి వద్ద ప్రమాదం
- నిడమర్రులో పెళ్లింట విషాదం



సంఘటనాస్థలిలో అప్పారావు, ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో అప్పన్న మృతదేహాలు

దెందులూరు/నిడమర్రు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆ ఇంటికి పచ్చ తోరణాలు కడుతున్నారు.. పందిరి వేస్తున్నారు.. మరో వైపు పెళ్లి కార్డులు పంచడానికి హడావుడి. కొద్ది రోజుల్లో పెళ్లి బాజా మోగనుంది. అంతలోనే ఇంటి పెద్దను మృత్యువు కబళించడంతో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. నిడమర్రు గ్రామానికి చెందిన పతివాడ బాపన్న పెద్ద కుమారుడికి ఈ నెల 18న వివాహం. దగ్గరి బంధువులకు పెండ్లి కార్డు ఇవ్వడానికి బంధువు గరిమెళ్ల అప్పారావుతో కలిసి బాపన్న మోటార్‌సైకిల్‌పై బయలు దేరాడు. శుభలేఖలు ఇచ్చి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరూ మృత్యుఒడికి చేరారు.

దెందులూరు మండల పరిధిలో కొమిరేపల్లి అడ్డ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం ద్విచక్ర వాహనాన్ని వెనక నుంచి కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న గరిమెళ్ల అప్పారావు (50) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన వరుడి తండ్రి పతివాడ బాపన్న (55)ను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందారు. ఏలూరు, దెందులూరులో బంధువులకు శుభలేఖలు ఇచ్చి తిరిగి నిడమర్రు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనపై దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసిన విచారణ ప్రారంభించారు.

బాపన్నకు ఇద్దరు కుమారులు కాగా వారం రోజుల్లో పెద్ద కుమారుడి వివాహం జరగనుండగా ప్రమాదంతో విషాదం నిపింది. బాపన్నతో పాటు శుభలేఖలు ఇవ్వడానికి వెళ్లిన బంధువు అప్పారావు కూడా మృత్యువాత పడడంతో పెళ్లి ఇల్లు శోకసంద్రమైంది.

క్వాయర్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

రూ.3 కోట్ల నష్టం అంచనా



అగ్ని ప్రమాదంతో ఫ్యాక్టరీపై దట్టంగా అలుముకున్న పొగ

దెందులూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సోమవరప్పాడులోని దుర్గా క్వాయర్ ఇంపెక్స్ ఫ్యాక్టరీలో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. మధ్యాహ్నం వర్కర్లు భోజనం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. పరుపులు, సోఫాలు పెద్ద ఎత్తున మంటలో దగ్ధమయ్యాయి. ఫ్యాక్టరీ యాజమాన్యం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అప్పటికే అధిక శాతం కాలిపోయాయి. ప్రమాదంలో ఫ్యాక్టరీ ఆస్తులు కూడా దగ్ధం కావడంతో సుమారు రూ.3 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు ఫ్యాక్టరీ యాజమన్యం తెలిపింది. భోజనం సమయం కావడంతో ఫ్యాక్టరీలో కార్మికులకు ఎలాంటి నష్టం కలగలేదు.

భీమవరం డీఎస్పీగా జయసూర్య

భీమవరం క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భీమవరం డీఎస్పీగా ఆర్‌జి జయసూర్య నియమితులయ్యారు. ఇటీవల రాష్ట్రంలో 11 మంది డీఎస్పీలకు బదిలీలు జరిగాయి. గతంలో ఆర్‌జి జయసూర్య డీఎస్పీగా ఉన్న నేపథ్యంలో రిలీవ్ చేశారు. ఆ స్థానంలో ఎస్.మహేంద్ర రావాల్సి ఉంది. తిరిగి జయసూర్య భీమవరం డీఎస్పీగానే కొనసాగుతున్నారు. ప్రస్తుత బదిలీల్లో జయసూర్యను భీమవరానికి, మహేంద్రను మదనపల్లి డీఎస్పీగా బదిలీ చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి



జల్లికొమ్మర వద్ద సంఘటనాస్థలిలో సుబ్రహ్మణ్యం మృతదేహం

టిప్పర్ లారీ ఢీకొని..

గణపవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండలం జల్లికొమ్మరలో గురువారం టిప్పర్‌లారీ ఢీకొన్న సంఘటనలో కట్టా సుబ్రహ్మణ్యం (37) అక్కడికక్కడే మృతి చెందాడు. రాజమండి టి.నగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం మోటర్‌సైకిల్‌పై వెళుతుండగా టిప్పర్ లారీ ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై అకుల మణికుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మోటార్‌సైకిల్ ఢీకొని..

పెనుమంట్ర: బ్రాహ్మణ చెరువు శివారు ప్రాంతంలో నడిచి వెళుతున్న వ్యక్తిని మోటారు సైకిల్ ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. బ్రాహ్మణ చెరువు వైపు నుంచి నడిచి వస్తున్న పాద చారుని బ్రాహ్మణ చెరువు నుంచి మార్టేరు వెలుతున్న మిక్సీ మెకానిక్ మోటారు సైకిల్‌తో ఢీకొనడంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మోటారు సైక్లిస్టును 108లో ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు సేకరిస్తునట్లు ఎస్ఐ వేంద్ర వెంకటేశ్వరరావు తెలిపారు.

లారీ ఢీకొని..

అత్తిలి: ఉరదాళ్లపాలెంకు చెందిన వ్యక్తిని లారీ ఢీకొని మృతి చెందాడు. కాంక్రీట్ పని చేసుకునే యడ్ల శ్రీనివాసరావును బుధవారం రాత్రి లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. అతడి భార్య గంగమ్మ గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి ప్రేమరాజు తెలిపారు.

వృద్ధుడి మృతి

పెంటపాడు: వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన బుధవారం అర్ధరాత్రి జరిగింది. పెంటపాడు శివారులో సుమారు 60 ఏళ్ల వృద్ధుడిని వాహనం ఢీకొన డంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వీఆర్వో ప్రశాంతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పోక్సో కేసులో ఆర్ఎంపీ అరెస్టు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆర్ఎంపీ వైద్యుడిని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ అరెస్టు చేశారు. ఏలూరులోని రామానగర్ కాలనీకి చెందిన యేళ్ళ రత్న ప్రసాద్ (56) ఆర్ఎంపీగా వృత్తిని సాగిస్తున్నాడు. ఈనెల 7న తన ఇంటి ముందు నడిచి వెళుతున్న 9 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తప్పించుకుని మరుసటిరోజు కుటుంబ సభ్యులకు చెప్పడంతో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి సీఐ సత్యనారాయణ దర్యాప్తు చేశారు. రత్న ప్రసాద్‌ను గురువారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు.

క్రికెట్ బెట్టింగ్‌లో ఒకరి అరెస్టు

పెనుగొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): క్రికెట్ పందెం వేస్తున్న ఐ.శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.గంగాధర్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్ సమాచారం రావడంతో దాడి చేయగా జూమ్ యాప్‌లో పంటర్స్‌తో మాట్లాడుతున్న శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. అతడి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లు, రూ. 2 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

పెనుగొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్న యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సిద్ధాంతం గ్రామానికి చెందిన ఈదుబిల్లి నాగలక్ష్మి దుర్గ (18) పెనుగొండలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసింది. కొంత కాలంగా ఆమె గుండె సమస్యతో బాధపడుతోంది. గతంలో ఆమెకు గుండె ఆపరేషన్ కూడా అయింది. గురువారం ఎక్కువుగా నొప్పి రావడంతో బాత్‌రూమ్‌లో ఉరి వేసుకుని చనిపోయినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని మృతి

భీమవరం క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని తాను ఉంటున్న రూమ్‌లోనే గురువారం ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన యు.స్వర్ణకుమారి (19) పట్టణంలోని ప్రముఖ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. స్నేహితులందరూ కలసి పిక్నిక్‌కు వెళ్లడంతో ఆమెకు కాలు బాగోలేదని వెళ్లలేదు. కాగా ఆమె ఎందుకు ఉరి వేసుకుందనే వివరాలు తెలియరాలేదు. వివరాలు సేకరిస్తున్నట్లు భీమవరం రూరల్ హెడ్ కానిస్టేబుల్ మహేశ్వరరావు తెలిపారు.

భార్యతో గొడవ.. మనస్తాపంతో..

అత్తిలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అత్తిలికి చెందిన కురందాసు నాగేంద్ర పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఎస్ఐ పి.ప్రేమరాజు తెలిపారు. కోరుకొల్లు గ్రామానికి చెందిన నాగేంద్ర అత్తిలిలో తన భార్యతో ఈనెల 7న గొడవ పడ్డాడు. ఈ విషయాన్ని ఆమె తల్లికి ఫోన్ చేసి చెప్పడంతో నాగేంద్ర మనస్తాపానికి గురై ప్రతి విషయాన్ని ఎందుకు చెబుతావని పురుగుల మందు తాగేశాడు. అతడి భార్య తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించింది. మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల సంక్షేమం కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

టి.నర్సాపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ సాయిబాబా తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన నాయకులతో కలిసి ప్రారంభించారు. దళారుల నుంచి మోసపోకుండా ప్రభుత్వం రైతుల కోసం ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి, ఎంపీడీవో మణికుమారి, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు నాగరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావుగౌడ్ పాల్గొన్నారు.

కార్మికులు ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : కార్మికులంతా కలిసి కట్టుగా ముందుకు సాగాలని అప్పుడే ఆర్టీసీ సంస్థ అభివృద్ధి చెందుతుందని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. గురువారం ఏలూరు డిపో గ్యారేజీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.అనంతరం ఆర్టీసీ ఆస్పత్రిని పరిశీలించారు. డిపో మేనేజర్ బి.వాణి, అసిస్టెంట్ మేనేజర్ జి.మురళీ, ఎంఎఫ్ఐ ప్రేమ్‌కుమార్, పీఆర్వో నరసింహం పాల్గొన్నారు.

సూర్యఘర్ మోడల్ విలేజ్‌గా కాగుపాడు

ఉంగుటూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : కాగుపాడు గ్రామాన్ని సూర్యఘర్ మోడల్ విలేజిగా విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించారు. గురువారం కాగుపాడులో డీఈ అంబేద్కర్, ఏడీఈ శ్రీనివాసరావు, ఏఈ శ్రీరాం, సబ్ ఇంజనీర్ శివలకు గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు పూర్తి శాతం రాయితీ వర్తించగా మిగిలిన వారికి 38 శాతం అందిస్తామన్నారు. కాగుపాడు మాజీ సర్పంచి కడియాల రవిశంకర్ ఇంటి వద్ద జరిగిన అవగాహన కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ పొట్ల ఏడుకొండలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ఉంగుటూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ధర్మరాజు మహిళలను కోరారు. ఉంగుటూరులోని పాత సచివాలయం వద్ద శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఉంగుటూరు మండలం నుంచి 108 మంది, నిడమర్రు నుంచి 87, గణపవరం నుంచి 103 మంది, భీమడోలు నుంచి 95 మంది శిక్షణకు హాజరవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు మూడు నెలల ఉచిత శిక్షణ

ఉంగుటూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతీ, యువకుల ఉపాధి అవకాశాల నిమిత్తం టెన్త్, ఆపై చదివి ఖాళీగా ఉన్న వారికి వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో రాజ్ మనోజ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, పురుషులకు హోటల్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ కావాల్సిన వాళ్లు శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో హాజరవ్వాలని, వివరాలకు(80745 00710, 93928 19393)నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ముంపు మండలాలైన ఏలేరుపాడు, కుక్కునూరులోని నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కె.ఆర్.పురం ఐటీడీఏ పీవో, ఆర్అండ్ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్‌ను కోరారు. గురువారం బుట్టాయగూడెం వచ్చిన పీవోను కలిసి సమస్యను విన్నవించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలతో పాటు, పోలవరం కాల్వల గట్లు పూడ్చడం వంటి సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ఎస్.కె.గౌస్, నాయకులు జి.ప్రభాకర్, బి.కృష్ణ, కె.వీరాస్వామి, ఎస్.కె.మున్ని ఉన్నారు.

చెత్త నుంచి సంపద శిక్షణ తరగతుల ముగింపు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) :దొరమామిడిలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. గురువారం పోలవరం, జంగారెడ్డిగూడెం ఎంపీడీవోలు కృష్ణప్రసాద్, శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీలు నాగిరెడ్డి, శ్రీనివాసరావులు చెత్త నుంచి సంపద సృష్టిపై కార్యదర్శులకు, హరిత రాయబారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం రాముడు, ఉపసర్పంచ్ మద్దిపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి జె.కిరణ్‌కుమార్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

16న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

చింతలపూడి/లింగపాలెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల నిర్వాహకులు తెలిపారు. ఈ మేళాలో 15కుపైగా బహుళ జాతీయ సంస్థలు పాల్గొంటాయని, రెండు తెలుగు రాష్ట్రాల్లోని నిరుద్యోగ యువత ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. టెన్త్ నుంచి పీజీ వరకు విద్యార్హతలు ఉన్న విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, జిల్లా ఉపాధి కార్యాలయం అధికారులు పాల్గొంటారని తెలిపారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో స్థానిక నాయకులు, నిరుద్యోగులకు జాబ్ మేళా గురించి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలియజేశారు. ఈ జాబ్ మేళాను యువత సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

ధాన్యం సేకరణపై రైతులకు అవగాహన

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : పంగిడిగూడెం, లక్కవరం, పేరంపేట, గురవాయిగూడెం గ్రామాల్లో రైతులకు తహసీల్దార్ కె.స్లీవజోజి ఆధ్వర్యంలో ధాన్యం సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో డి.వెంకటరమణ లక్కవరం గ్రామంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి గోనె సంచులను పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం క్వింటాలుకు రూ.2,300 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన గోనెసంచులు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కేవీఎస్ పొసరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై అప్పలనాయుడు ఫైర్



ఏలూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పవన్ కల్యాణ్ అనుకోకుండా డిప్యూటీ సీఎం అయ్యా రంటూ తెలంగాణ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలను విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ఖండించారు. లిక్కర్ స్కాంలో మూడు నెలల పాటు జైలు జీవితం గడిపిన కవితకు పవన్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. తన ఉనికిని కాపాడుకునేందుకే కవిత ఈ వ్యాఖ్య లు చేశారని రెడ్డి అప్పలనాయుడు తీవ్రంగా మండిపడ్డారు.

పెంచిన డీజిల్, గ్యాస్, పెట్రో ధరలు తగ్గించాలి

టి.నర్సాపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన డీజిల్, గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలని కోరుతూ(ఐద్వా) మహిళా సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో ఏఎస్ఆర్ నగర్ వద్ద మూడు రోడ్ల జంక్షన్‌లో గురువారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి ధర్నా నిర్వహించారు. ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి ఏ.శ్యామలరాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదలపై భారం వేస్తోందన్నారు. ప్రజలు చెల్లించే పన్నులు, జీఎస్టీలు, కార్పొరేట్ కంపెనీల అధిపతులకు దోచిపెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి మడకం కుమారి, సీపీఎం మండల కార్యదర్శి సుధారాణి పాల్గొన్నారు.

నిడమర్రులో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నిడమర్రు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం నిడమర్రు వెలుగు కేంద్రంలో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఈ శిక్షణ కార్యక్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమారి, సర్పంచ్ పొట్నూరి ఉమామహేశ్వరరావు, వెలుగు ఏపీఎం రత్న కుమార్, అంబళ్ల విజయ్ కుమార్, రత్న కుమార్ పాల్గొన్నారు.

బ్యాంకు మాజీ అధ్యక్షులు రాము అనారోగ్యంతో మృతి



దెందులూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకులు, గాలాయగూడెం సహకార సంఘం బ్యాంకు మాజీ అధ్యక్షులు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, కాపు ఉద్యమ సంఘ నాయకులు కురంశెట్టి రాము (తుంగా రాము)అనారోగ్యంతో మృతి చెందారు. రాము గాలాయగూడెం శ్రీఅచ్చమ్మ పేరంటాలమ్మ దేవస్థానం శాశ్వత గౌరవాధ్యక్షులుగా పని చేశారు. రాము భౌతిక కాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

దెందులూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు అంగన్వాడీ సెక్టార్ సూపర్ వైజర్ చిట్టెమ్మ అన్నారు. గురువారం దెందులూరు మండలం, పోతునూరు చల్లచింతలపూడిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రొక్కం జయరత్న కుమారి, చవల భారతి, కవిత సిబ్బంది ఉన్నారు.

ఆస్తి పన్నులు తగ్గించండి : సీపీఎం రవి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగరాలు, పట్టణాల్లో పెంచిన ఆస్తి పన్నులు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి కోరారు. ఆస్తి విలువ ఆధారిత ఇంటిపన్ను విధానం రద్దు చేయాలన్నారు. 2025-26 సంవత్సరానికి పెంచిన 30శాతం ఆస్తిపన్నును విరమించుకోవాలన్నారు. ఈ ఐదేళ్లలో ఆస్తిపన్ను వందశాతం పెరిగిందని,తగ్గింపునకు చర్యలు తీసుకోవాలన్నారు.

వేసవిలో మట్టి కుండలకు గిరాకీ



లింగపాలెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరడంతో ప్రజలు ఎండవేడికి బయటకు రాలేక ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. దీనికితోడు వడగాలులు వీస్తుండంతో బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. అంతేకాకుండా ఇళ్లలోనూ, ప్రయాణ సమయంలో ఎండవేడిని తట్టుకునేందుకు చల్లని కూల్ డ్రింక్స్ జ్యూస్‌లు, ప్లాస్టిక్ బాటిల్స్‌లోని నీరు తాగుతుండటంతో శరీరం డీహైడ్రేడ్ అయ్యి వడదెబ్బ తగలడం లాంటి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అయితే వేసవిలో అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే మట్టి కుండల్లోని నీరు తాగడమే ఉత్తమమని పలువురు వైద్యులు చెబుతుండటంతో ఆరోగ్యాన్ని కొంతైనా కాపాడుకోవచ్చని చెబుతున్నారు. అందుకే ప్రజలు మట్టికుండల వైపు ఆసక్తి చూస్తున్నారు. దీంతో మట్టికుండలకు మంచి గిరాకీ పెరిగింది. మండలంలో కొందరు కుండల అమ్మకందారులు బీమడోలు, వీరవల్లి నుంచి మట్టి కుండలను దిగుమతి చేసుకుని ఒక్కో కుండ వాటి సైజును బట్టి వంద నుంచి 250 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. గత ఏడాది కుండల అమ్మకాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ ఏడాది ప్రస్తుతం మట్టికుండల అమ్మకం తక్కువగా ఉందని ఎండలు పెరిగితే కుండల విక్రయాలు మరింత పెరుగుతాయని మట్టికుండల వ్యాపారులు చెబుతున్నారు.

అమ్మకాలు పెరుగుతున్నాయి..

ఎండలు ముదరడంతో ప్రజలు ఇప్పుడిప్పుడే మట్టి కుండల కొనుగోళ్లపై ఆసక్తి చూపిస్తున్నారు. మా ప్రాంతంలో తయారీ తక్కువగా ఉండటంతో భీమడోలు, వీరవల్లి నుంచి మట్టి కుండలను దిగుమతి చేసుకుంటున్నాం. ప్రభుత్వం మట్టికుండల అమ్మకాలను ప్రోత్సహించి మాకు చేయూతనిస్తే బాగుంటుంది.

పెంద్ర సాయి, మట్టికుండల అమ్మకందారు

ఘనంగా ఎంపీ మహేశ్ పుట్టిన రోజు వేడుకలు



జీలుగుమిల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):నగరంలో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పుట్టిన రోజు వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో కట్ చేసి మిఠాయిలు పంచగా ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వాసన్ ఐకేర్ ఆసుపత్రి సిబ్బంది ద్వారా టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షులు ఆరేపల్లి శివ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మాదేపల్లి ప్రేమాలయంలో, కోటదిబ్బ ఆశ్రమాల్లో అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్,పూజారి నిరంజన్, రెడ్డి నాగరాజు, నందిగం సీతారామతిలక్, ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు, కాట్రు బాలకృష్ణ, త్రిపర్ణరాజేశ్, షేక్ ఖరీముల్లా, నందిగం రవిచంద్ర, సంధ్యా, సంధ్యా అలూరి రమేశ్, ఎస్.మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : ఉంగుటూరు, కాగుపాడు గ్రామాల్లో నిర్వహించిన పుట్టిన రోజు వేడుకల్లో టి.డి.పి మండలాధ్యక్షులు పాతూరి విజయ్ కుమార్, సర్పంచ్ బండారు సింధు, కడియాల రవి శంకర్,రెడ్డి చందు,ఉపసర్పంచి పాతూరి జగదీశ్, ఎస్సీ సెల్ నాయకులు నేకూరి ఆశీర్వాదం ఘంటా ఉషారాణి పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ పుట్టిన రోజు వేడుకలు స్థానిక సి.హెచ్.ఆర్ టౌన్‌హాల్లో ఎంపీ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, నాయకులు పరిమి సత్తిపండు,తూటిగుంట రాము, సూర్య శ్రీనివాస్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, గుమ్మడి ప్రసాద్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్ పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఎంపీ పుట్టిన రోజు వేడుకల్లో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు మొగపర్తి సోంబాబు, గద్దె అబ్బులు, ఆలపాటి ఫణి కిశోర్, మొడియం సింగరాజు, కుందుల శ్రీను, మనెల్లి బాలు, చిలకమూడి సుధాకర్, ఎం.ములసయ్య, మానికల శ్రీను పాల్గొన్నారు.

● చింతలపూడి : ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ఈ జిల్లాకు ఓ వరం అని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీ పుట్టిన రోజును పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భట్టువారిగూడెం రోడ్డులోని లిబర్టీ చిల్డ్రన్స్ హోంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, చిట్లూరి ధర్మరాజు, మాటూరి వెంకట్రామయ్య, కె.రాజారెడ్డి, కొత్తపూడి శేషగిరిరావు పాల్గొన్నారు.

● కామవరపుకోట :కొత్తూరులోని ఆర్అండ్‌బీ బంగ్లా సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, తెలుగుదేశం మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షులు ఖాన్ వజీర్ బృందం కేక్‌ను కట్ చేసి పుట్టిన రోజు వేడుకను నిర్వహించారు. ఆడమిల్లిలో సర్పంచ్ గూడపాటి కేశవరావు, టీడీపీ చింతలపూడి నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు జిజ్జూరి బాబ్జీ, తడికలపూడిలో టీడీపీ నాయకులు బొంతు వెంకటేశ్వరరావు, బొప్పన అంజియ్య, తూతా లక్ష్మణరావు, మేరుగు సుందరరావు, గుంటుపల్లి పంచాయతీలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు బేతిన వెంకట్రావు, సర్పంచ్ గోరింక దాసు, ఎంపిటిసి కంఠమనేని పుష్పరాజ్యం బర్త్‌డే కేక్‌లు కట్ చేసి వేడుకలు నిర్వహించారు.



బుట్టాయగూడెంలో కేక్ కట్ చేస్తున్న శ్రీనివాసులు

● జీలుగుమిల్లి : టీడీపీ మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి ఇంటి వద్ద ఎంపీ పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పలువురుకి పంచారు. అనంతరం నాయకులకు కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వాలు అందజేశారు. జనసేన పార్టీ మండలాధ్యక్షులు పసుపులేటి రాము, తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షులు ఉండవల్లి సోమ సుందరం, మాజీ జడ్పీటీసీ బి.రాజబాబు, ఎస్టీ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చేప రవి, గారపాటి శ్రీను, గద్దె సుబ్రహ్మణ్యం, జి.లక్ష్మీనారాయణ, గొట్టాల సత్యనారాయణ, బి.అఖిల్ ఉన్నారు.

● కొయ్యలగూడెం : ఎంపీ పుట్టిన రోజును పురస్కరించుకుని బయ్యన్నగూడెం గ్రామంలో టీడీపీ మండలాధ్యక్షుడు పారేపల్లి నరేశ్ గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పారేపల్లి వీరాస్వామి, మాజీ సర్పంచ్ పారేపల్లి సత్యనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు పారేపల్లి నరేశ్ పాల్గొన్నారు. అలాగే కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జ్యేష్ట రామకృష్ణ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

● లింగపాలెం : స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ మండలాధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు ఆధ్వ ర్యంలో కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి మల్లికార్జునరావు,నందిగం సీతారామతిలక్, మునునూరి రాము, గారపాటి బుజ్జయ్య, ఎం.వరప్రసాద్ పాల్గొన్నారు.



వేసవి తాపానికి మూగజీవాలు విలవిల

పెదపాడు : గ్రీష్మతాపానికి చిన్నాపెద్దా ఉడికిపోతున్నారు. ఇక మేతకోసం బయటకు వెళ్లే మూగ జీవాల పరిస్థితి వర్ణనాతీతం. పొలాల వెంబడి తిరుగుతూ పచ్చిక తిని సమీపంలోని పంటబోదెలు, చెరువుల్లో నీటిని తాగి ఎండ వేడికి తాళలేక చెట్ల నీడన ఇలా సేదతీరుతున్నాయి.

దేశాభివృద్ధికి ప్రధాని మోదీ కృషి

ఉంగుటూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) :ప్రధాని మోదీ దేశాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపాటి సత్యనారాయణ పేర్కొన్నారు. ఉంగుటూరు కమ్యూనిటీ హాల్లో బీజేపీ క్రియాశీల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనేక విషయాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ కిశోర్, ఇందుకూరి చక్రవర్తి వర్మ,పెన్మత్స రామచంద్రరాజు, కూనిరెడ్డి సోమేశ్వరరావు, ప్రవీణ్ పటేల్, ఇంటి ఉదయ భాస్కరరావు, వి.దుర్గారావు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధనలు

పెదపాడు/పెదవేగి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : పెదపాడులోని పెట్రోల్‌బంక్ వద్ద కోదండ రామాలయం వద్ద, పెదవేగి మండలం లక్ష్మీపురంలోని ఆలయంలో ఘనంగా అన్న సమారాధనలు నిర్వహించారు. పెదపాడులో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా గురువారం అన్న సమారాధన నిర్వహించగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అన్న ప్రసాదాలు స్వీకరించారు. లక్ష్మీపురంలో నిర్వహించిన అన్నసమారాధనలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొని ఆలయంలో పూజలు నిర్వహించారు. భారీగా ప్రజలు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించినట్టు గ్రామ సర్పంచ్ మేక కనకరాజు తెలిపారు.

రైతు సేవా కేంద్రాల తనిఖీ

భీమడోలు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పోలసానపల్లి, భీమడోలులోని రైతు సేవా కేంద్రాలను తహసీల్దార్ తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు నాణ్యతగా ఉండాలని, ధాన్యం కొనుగోలు సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి తేమ శాతం 17 కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో ఎగుమతులు, దిగుమతులకు ఎటువంటి చార్జీలు ఇవ్వాల్సిన అవసరం లేదని అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

పోషకాహారంపై అవగాహన ర్యాలీ

కుక్కునూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు సెక్టార్ పరిధిలోని విజరం - 2 అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ మయూరి ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోషకాహారం తీసుకునే పద్ధతులపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ లక్ష్మీదేవి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



పద్మశ్రీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

జడ్పీ చైర్ పర్సన్‌కు పరామర్శ

పెదపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ కుటుంబాన్ని టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి చైర్మన్ పీతల సుజాతలు గురువారం పరామర్శించారు. పద్మశ్రీ అత్తగారు అచ్చాయమ్మ ఇటీవల మృతి చెందడంతో పెదపాడు మండలం సత్యవోలు వెళ్లి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు ఘంటా ప్రసాదరావు, ఘంటా ఫణీంద్రలకు సానుభూతిని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కరాటం రాంబాబు

పేదల వైద్యానికి ప్రాధాన్యం : కరాటం

బుట్టాయగూడెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, ఏపీ ట్రైకార్ కార్పొరేషన్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. గురువారం బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాడేపల్లిగూడేనికి చెందిన ఆత్మబంధువులం సేవా సంఘం, హైదరాబాదుకు చెందిన గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ నిర్ధారణ ఉచిత పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, జనసేన నాయకులు కరాటం సాయిబాబా, గడ్డమణుగు రవికుమార్, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య నగరంగా తీర్చిదిద్దండి

ఏలూరుటూటౌన్,ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నగరంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే చంటి అన్నారు. శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా 5,6 డివిజన్లలో ఎమ్మెల్యే చంటి పర్యటించారు. అనంతరం పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతూ పనిలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కోఆప్షన్ సభ్యులు పెదబాబు మాట్లాడుతూ కొందరూ విధులు నిర్వహించకుండా వేరే వ్యాపారాలు, వేరే ఉద్యోగాలు చేసుకుంటున్నారని అటువంటి వారిపై వేటు తప్పదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి, చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరం : ఆర్.ఆర్.పేట పార్కు వద్ద ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ శివమూర్తి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హోమియో వైద్య సృష్టికర్త డాక్టర్ సీఎస్ శామ్యూల్ హనీమన్ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటి వైద్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, సంధ్యాశ్రీలక్ష్మి, ఆరేపల్లి తిరుపతి, డాక్టర్ వి.కె.పంకజాక్షన్, డాక్టర్ భాస్కరాచార్యులు, డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ రామచంద్రరావు పాల్గొన్నారు.



మహిళకు కుట్టుమిషన్ అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

అర్జీల స్వీకరణ : క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి ఎమ్మెల్యే బడేటి చంటి అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఫోన్లు చేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఇదే కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యురాలు నీతా జైన్ సమకూర్చిన కుట్టు మిషన్‌ను లక్ష్మి అనే పేద మహిళకు అందించారు. ఈ కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, బెల్లంకొండ కిషోర్, ఆర్నేపల్లి తిరుపతి పాల్గొన్నారు.



డిపో ముందు ధర్నా చేస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలి : ఏపీపీటీడీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు.ఏలూరు ఆర్టీసీ డిపో ముందు గురువారం ధర్నా, గేటు మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.ఎస్. రావు, డిపో ప్రెసిడెంట్ పిఎస్ఎన్‌వి ప్రసాద్, డిపో జాయింట్ సెక్రటరీ కెఆర్‌కె రావు, గంగరాజు, ఎస్.బాబు పలువురు పాల్గొ ని మాట్లాడుతూ యూనియన్ పిలుపు మేరకు ఈ నెల 10, 11 తేదీల్లో ఈ ధర్నాలు చేస్తున్నట్టు వెల్లడించారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘ 90వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఏలూరులోని పత్తేబాదలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కడుపు కన్నయ్య మాట్లాడుతూ నేతన్న నేస్తం పథకాన్ని సొంత మగ్గం ఉన్న వారితో పాటు ప్రతి ఒక్కరికీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు బి.సత్యనారాయణ, ఎన్.శేఖర్, ఎం.అమ్మాజీ, కె.రంగనాయకమ్మ, సూర్యకాంతం, పాపాయమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తల సేవలు అభినందనీయం

భీమడోలు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : జనసేన కార్యకర్తలు ప్రజలకందిస్తున్న సేవలు అభినందనీయమని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు సంత మార్కెట్‌లోని జనసేన స్తూపం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

నేడు జ్యోతిరావు పూలే జయంతి

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆలపాటి గంగాభవానీ కల్యాణ మండపంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ఏలూరు ఎంపీ మహేశ్, చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ హాజరవుతారని నాయకులు పాల్గొనాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు తెలిపారు.

వట్లూరులో రక్తదాన శిబిరం

పెదపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల చైర్మన్ కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏలూరు బ్లడ్ బ్యాంక్, రెడ్ క్రాస్ సిబ్బంది విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ సాయిరోహిత్, ప్రిన్సిపాల్ డాక్టరు మురళీధరరావు పాల్గొన్నారు.

18న సర్వోదయ ఆవిర్భావ దినోత్సవం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం నాచుగుంట వద్ద ఉన్న సర్వోదయ స్థూపం వద్ద 65వ సర్వోదయ సమ్మేళన ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 18న నిర్వహిస్తున్నట్టు జిల్లా సర్వోదయ మండలి ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ప్రజల్లో జాతీయత పెంపొందించే లక్ష్యంగా 1961లో సర్వోదయ సమ్మేళనం నిర్వహించినట్టు గుర్తు చేశారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య ఇంటర్మీడియట్ సైన్స్ ప్రాక్టికల్స్ ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షకు 29మంది విద్యార్థులు, కెమిస్ట్రీ 29మంది, బయోలాజికల్ సైన్సు పరీక్షకు 17మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ ప్రాక్టికల్స్‌లో మొత్తం 25 మంది గైర్హాజరయ్యారని అన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

జీలుగుమిల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : మరమ్మతుల్లో భాగంగా మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.అహ్మద్‌ఖాన్ తెలిపారు. మైసన్నగూడెం ఫీడర్‌లో తీగలకు అడ్డుగా ఉన్న చోట్ల చెట్ల కొమ్మలు తొలగించనున్నట్టు తెలిపారు. ఈమేరకు రాచన్నగూడెం, పి.నారాయణపురం, కుక్కునూరు, వేలేరుపాడు, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఏలూరు మండలంలో మరమ్మతులు

ఏలూరు రూరల్ : చాటపర్రు సెక్షన్ పరిధిలోని చాటపర్రు, గుడివాకలంక పరిధిలో కె.డి.పురం, తిమ్మారావుగూడెం, కొమడవోలు, ఆటోనగర్, తూర్పు లాకులు, సాయి నగర్ ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తొలగించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.అంబేద్కర్ తెలిపారు.

టి.నర్సాపురం మండలంలో..

టి.నర్సాపురం : మండలంలోని రాజుపోతేపల్లి, వెలగపాడు, సబ్‌స్టేషన్ల పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డి గూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అహ్మద్ ఖాన్ కోరారు.

కొయ్యలగూడెం మండలంలో..

కొయ్యలగూడెం : రాజవరం ఫీడర్ పరిధిలోని పరింపూడి, పుంగుటూరు, గవరవరం పంచాయతీల్లో శుక్ర వారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు.

భీమడోలు మండలంలో

భీమడోలు : భీమడోలు సెక్షన్ పరిధిలోని పూళ్ళ, సూరప్పగూడెం, గుండుగొలను సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేద్కర్ తెలిపారు. దుద్దేపూడి, పూళ్ళ, కురెళ్లగూడెం, ఎంఎంపురం ఇండస్ట్రియల్ ఫీడర్లకు సూరప్పగూడెం, పోలసానిపల్లి ఫీడర్లకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

టీడీపీ నుంచి వెంకటకృష్ణ సస్పెండ్

జీలుగుమిల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : పార్టీని అడ్డం పెట్టుకుని ప్రజలను, వ్యాపార సంస్థలను ఇబ్బందులకు గురిచేస్తున్న పి.వెంకటకృష్ణను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు టీడీపీ మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి తెలిపారు. ఇకనుంచి వెంకటకృష్ణకు పార్టీ కార్యకలాపాలకు ఎటు వంటి సంబంధం లేదన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

కలిదిండి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. చినతాడినాడలో గురువారం మనబడి -మన భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా దాతలు జంపన కాశీరాజు, రామరాజుల ఆర్థిక సాయంతో నిర్మించిన నూతన అదనపు భవనాన్ని ప్రారంభించారు. జడ్పీటీసీ సత్యవతి, రాష్ట్రచేపల రైతు సంఘ అధ్యక్షుడు తాడినాడ బాబు, సర్పంచ్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరంలో సీతారామ కల్యాణోత్సవాలు

ముదినేపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి శివారు అన్నవరం ఉన్న సీతారామ మారుతీ ఆలయంలో గురువారం కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 12న పౌర్ణమి రోజున నిర్వహించనున్న కల్యాణానికి స్వామివార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేసి అర్చకులు విన్నకోట చంద్రశేఖర్ సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సంక్షోభంలో మామిడి రైతు


నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం

(నూజివీడు- ఆంధ్రజ్యోతి)

మామిడి రైతుకు ఎదురుదెబ్బలతో సాగుకు క్రమేణా దూరమవుతున్నాడు. ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టిసారించడంతో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని నూజివీడు డివిజన్‌లో మామిడి విస్తీర్ణం 60వేల హెక్టార్ల నుంచి 40వేల హెక్టార్లకు పడిపోయింది. గిట్టుబాటు ధర లేక రైతుకు ఏటా నష్టాలు తప్పడం లేదు. నూజివీడు ప్రాంతంలో 2004 ప్రాంతంలో మామిడి పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేసినా పరిశోధనా ఫలాలు రైతులకు చేరువ కావడం లేదు. మరోవైపు నకిలీ పురుగు మందులు, ఎరువులతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. గ్రామం యూనిట్‌గా పంటల బీమా అమలు, ఇతర పంటల మాదిరి పంట ప్రోత్సాహకాలు, ఎగుమతికి ప్రోత్సాహం, నూజివీడు రైల్వే స్టేషన్ రైల్వే రాక్‌ల సరఫరా పునరుద్ధరణ, వేపర్ హీట్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావడం, గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ఎయిర్ కార్గోను ప్రారంభించి విదేశీ ఎగుమతులను ప్రోత్సహిస్తే నూజివీడు మామిడికి పూర్వ వైభవం వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యానమే దెబ్బతీస్తోంది!

ఉద్యానవన పంట ప్రోత్సహకాలు నూజివీడు ప్రాంతంలో మామిడిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఈ ప్రాంతంలో పామాయిల్ విస్తరణకు అధికారులు చర్యలు చేపట్టారు. నూజివీడు పరిసర ప్రాంతాలలో వ్యవసాయం మొత్తం భూగర్భ జలాలపైనే ఆధారపడి ఉంది. రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయ విద్యుత్ వినియోగిస్తున్న ప్రాంతం నూజివీడే. పామాయిల్ సాగుతో భూగర్భ జలాలపై ప్రభావం, అత్యధిక విద్యుత్ వాడకం ఉంటాయి. ఉద్యానవన అధికారులు పంట ప్రోత్సహకాల పేరుతో మామిడి రైతులను పామాయిల్ వైపు మరల్చడంతో మామిడికి ఎదురుదెబ్బ తగిలింది.

రైతులకు చేరని పరిశోధన ఫలాలు

2004లో మామిడి పరిశోధనా కేంద్రం ఏర్పాటుచేశారు. 2008లో రూ.13 కోట్లతో వేపర్ హీట్ ప్లాంటును ఏర్పాటుచేశారు. మామిడి పరిశోధనా కేంద్రం ఫలాలు


మూతపడిన వేపర్‌హీట్ ప్లాంట్

రైతులకు పూర్తిగా చేరడంలేదు. వేపర్‌హీట్ ప్లాంటు రైతుల దరిచేరలేదు. మల్లవల్లి మామిడి నర్సరీని పారిశ్రామిక అవసరాలకు తీసుకోగా పరిశోధనా కేంద్రం భూమి 20 ఎకరాలు పరిశోధనలకు సరిపోని పరిస్థితి. పరిశోధనల నిమిత్తం కనీసం 200 ఎకరాలు అవసరమని అధికారులు కోరినా అది నేటికీ సాకారం కాలేదు. వైయస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ ఉన్నతాధికారులు సైతం ఇదే విషయాన్ని మంత్రి కొలుసు పార్థసారధి దృష్టికి తీసుకొచ్చారు. రూ. 13 కోట్లతో ప్రారంభమైన వేపర్ హీట్ ప్లాంట్‌ను ప్రైవేటు వ్యాపారులకు లీజుకు ఇవ్వడం తప్ప రైతులకు ప్రయోజనం లేదు. గ్రామం యూనిట్‌గా పంటల బీమా ప్రవేశపెట్టి గ్రామ వ్యవసాయ సహాయకుల పర్యవేక్షణలో రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు అందుబాటులో తీసుకువస్తే మామిడి రైతుకు కొంత మేలు జరుగుతుంది. మామిడి ఎగుమతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. రైల్వే రాక్‌లతో పాటు ఇక్కడ నుండి ముంబై, కోల్‌కతా, నాగపూర్, న్యూఢిల్లీ, అమరావతి(మహారాష్ట్ర), తదితర ప్రాంతాలకు భారీగా ఎగుమతులు జరిగాయి. గత ప్రభుత్వ హయాంలో నూజివీడు రైల్వే స్టేషన్ నుంచి రైల్వే రాక్‌లు నిలిపివేయడంతో ఎగుమతులు నిలిచిపోయాయి. మామిడిలో చీడపీడల ఉధృతికి కల్తీ మందులే కారణంగా రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వ పర్యవేక్షణలో మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులు, పురుగుమందులు విక్రయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తాగునీటి చెరువులను నింపుకోవాలి : ఎమ్మెల్యే కామినేని


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కలిదిండి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా అడుగంటిన తాగునీటి చెరువులను యుద్ధ ప్రాతిపదికన నింపాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కలిదిండి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కాల్వలకు ఈనెల 15న తాగునీరు విడుదల చేస్తామన్నారు. అన్ని గ్రామాల్లో మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవాలన్నారు. గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చినతాడినాడ, కొండంగి గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కలిదిండి లాల్వ కాల్వపై వంతెన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో నిర్మాణ పనులు చేపడతామన్నారు. వారం రోజుల్లో ఏఎంసీ కమిటీల నియామకం జరుగుతుందన్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు అడ్డు పడే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జడ్పీటీసీ బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీలు కనక దుర్గారాణి, కట్టా నాగలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



నూజివీడు టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ పనులు చేస్తున్న బాలుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. నూజివీడు పట్టణం దళితపేటకు చెందిన చిట్టూరి ప్రవీణ్ (17) గాంధీనగర్‌లోని ప్రైవేటు పాఠశాల భవన నిర్మాణ పనులకు వెళ్లాడు. టైల్స్ వేసే పనిలో ఉండగా పక్కనే ఉన్న విద్యుత్ వైరును తాకడంతో షాక్ తగిలింది. తోటి కార్మికులు బాలుడిని హుటాహుటిన నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా వేంసూరుకు చెందిన మంగయ్య పురుగుల మందు తాగడంతో ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు తర లించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

48 గంటల్లోనే హుండీ దొంగ అరెస్టు

కైకలూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆలయంలో చోరీ చేసిన దొంగను 48 గంటల్లోనే పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్టు రూరల్ ఎస్ఐ రాంబాబు తెలిపారు. రామవరంలో ఈనెల 6వ తేదీ రాత్రి బస్టాండ్ పక్కనే ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ చోరీ జరిగింది. ఆలయ కమిటీ సభ్యుడు కావూరి వేణు గోపాలరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఉప్పుటేరు సెంటర్లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఓ వ్యక్తి వారిని చూసి పారిపోడానికి ప్రయత్నించగా అదుపులోకి తీసుకుని విచారించారు. గణపవరం మండలం అప్పన్నపేట పంచాయతీ మలపురాజుపేటకు చెందిన ముందుర్తి గణేష్(20)గా గుర్తించారు. ఆంజనేయస్వామి గుడిలోని హుండీను బద్దలుకొట్టి రూ.8వేలు చోరీ చేసినట్టు అంగీకరించాడన్నారు. అతడిని కైకలూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు విధించగా నెల్లూరు జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో పల్టీ..నలుగురికి తీవ్ర గాయాలు

ముసునూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ఆటో పల్టీ కొట్టడంతో నలుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కూలీలు గురువారం ఆటోలో వలసపల్లిలో మిరపకాయల కోతకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వెళుతుండగా సంధ్య వాగు సమీపంలో మలుపులో ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కల్యాణి, ఝాన్సీ, మరియమ్మ, స్రవంతి తీవ్రంగా గాయపడ్డారు. సహచర కూలీలు వారిని మరో ఆటోలో నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరుగురికి జైలు శిక్ష

నూజివీడు టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల విధులను అడ్డుకున్న ఆరుగురికి 15 రోజులు జైలు శిక్ష విధిస్త నూజివీడు ప్రత్యేక న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి గురువారం తీర్పు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలో ప్రభుత్వ భూమి ఆక్రమించారన్న ఫిర్యాదు మేరకు గ్రామ సెక్రటరీ చాగంటి పాటీ ఆంజనేయులు, బాపులపాడు మండల సర్వేయర్ గండికోట రంగారావు ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లారు. కన్నెగంటి పాపారావు మరో ఐదుగురు వారి విధులకు అడ్డం తగిలారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసును విచారించిన న్యాయమూర్తి నిందితులకు 15 రోజులు జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

దుష్ప్రచారంపై ఫిర్యాదు

చాట్రాయి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్‌యూనియన్ ఛైర్మన్ అనుచిత వ్యాఖ్యలపై చాట్రాయి మండలంలో పలు పాల సొసైటీ అధ్యక్షులు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్‌గా చలసాని ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించిన తర్వాత యూనియన్‌ను విజయవంతంగా నడిపిస్తున్నారని, ఈ క్రమంలో కొడాలి ప్రమీల పేరుతో ఒక మహిళ ఛైర్మన్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. వారిపై విచారణ నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కృష్ణామిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యుడు బొట్టు రామచంద్రరావు, సంఘం అధ్యక్షులు పుల్లారెడ్డి, ఎంబీ రాఘవరావు, ఎన్.శ్రీనివాసరావు, తదితరులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

పట్టణాల్లో పెంచిన ఆస్తి పన్ను తగ్గించాలి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో పెంచిన ఆస్తి పన్ను తగ్గించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామరావు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణాల్లో ఆస్తి పన్ను విపరీతంగా పెంచడంతో పట్టణంలో పేద, మధ్యతరగతి వర్గాలవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. 2025-26 సంవత్సరానికి ఆస్తి పన్ను 15 శాతం పెరిగిందన్నారు. పన్నులు పెంచబోమని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ తప్పిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలకు లొంగి ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో చాట్ల పుల్లారావు, పల్లె ప్రేమ్‌కుమార్, సి.ప్రవీణ్, ఒగ్గు ముఖర్జీ, రంగా, తదితరులు పాల్గొన్నారు.




కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని.. కైకలూరు ఎస్టీకాలనీలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న బీకేఎం నాని

ఘనంగా ఎంపీ పుట్టినరోజు వేడుకలు

కైకలూరు/మండవల్లి/కలిదిండి/ముదినేపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఏలూరు పార్లమెంట్ సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. గురువారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకుడు బీకేఎం నాని ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కైకలూరు ఎస్టీ కాలనీలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు, కూటమి నేతలు పూల రామచంద్రరావు, కొల్లి వర ప్రసాద్, కోటప్రోలు కృష్ణారావు, నల్లగోపుల చలపతి, కరేటి శ్రీహరి, బోయిన శ్రీనివాసరావు, బోడావుల ఎలీషారావు, బంకపల్లి భాస్కరరావు, బోయిన రామకృష్ణ, తలారి రాజేష్, తదితరులు పాల్గొన్నారు. మండవల్లి మండలం భైరవపట్నంలో గురువారం కూటమి నాయకులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మండవల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కేక్ కట్ చేసి చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఉపాధి కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కలిదిండి మండలం కోరుకొల్లులో జనసేన నాయకులు ఎంపీ పుట్టా మహేష్ బర్త్ డే కేక్ కట్ చేశారు. చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. కలిదిండిలో కూటమి నాయకులతో కలసి కామినేని ఎంపీ పుట్టా మహేష్ బర్త్ డే కేక్‌ను కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ముదినేపల్లిలోని ఎన్‌డీఏ కార్యాలయంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా ఎన్‌డీఏ నాయకులు కేక్ కట్ చేసి ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ, జనసేన నాయకులు కోడూరు శేషుబాబు, కోటప్రోలు కృష్ణారావు, సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, వీరంకి వెంకటేశ్వరరావు, బొంగు రవికుమార్, వీరంకి చక్రపాణి, పెదపాలపర్రు సర్పంచ్ గంటా రాకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చావలిపాడులో శిలువ యాత్ర

మండవల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం చావలిపాడు గ్రామంలో గురువారం శిలువ యాత్ర నిర్వహించారు. క్రైస్తవ భక్తిగీతాలతో శిలువ యాత్ర గ్రామంలో నిర్వహించారు. ఫాదర్ శాంతరాజు, ప్రదీప్‌లతో పాటు సంఘ కాపరి వర్రె దయానందులు పాల్గొన్నారు.



సంస్థాగతంగా బీజేపీ బలోపేతం కావాలి

కైకలూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీల నేతలతోనే ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో బీజేపీ సంస్థాపన దివస్ కార్యక్రమంలో భాగంగా క్రియాశీలక కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 6వ తేదీన బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని 14వ తేదీ అంబేడ్కర్ జయంతి వరకు సంస్థాపన దివస్ నిర్వహిస్తున్నామన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి కోట ప్రోలు కృష్ణారావు, ఎంపీపీ అడవి కృష్ణ, నాలుగు మండలాల బీజేపీ అధ్యక్షులు బోడావుల జగదీష్, సత్యవోలు నాగలక్ష్మీ, సమయం ఏసుబాబు, దుర్గాప్రసాద్, కోకా శ్రీనివాస్ పాల్గొన్నారు.